కాటన్ కట్టడానికి తూట్లు


- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద అక్రమార్కుల దందా
- గేట్లకు రంధ్రాలు చేసి రొయ్య సీడ్ సేకరణ

ఈనాడు రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, ఆత్రేయపురం: ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న ధవళేశ్వరం ఆనకట్ట భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కాటన్ మహాశయుడు నిర్మించిన ఈ అద్భుత కట్టడం కనీస నిర్వహణను గత అయిదేళ్లలో జగన్ సర్కారు పట్టించుకోలేదు. దీనికి అక్రమార్కులూ తోడయ్యారు. బ్యారేజీ గేట్లకు తూట్లు పొడుస్తూ రొయ్య సీడ్ అపహరిస్తున్నారు.


బ్యారేజీ తలుపుల వద్ద బుట్ట కట్టేందుకు దిగిన వ్యక్తి

నిబంధనలకు తూట్లు

ఆనకట్ట గేట్ల వద్ద రొయ్య విత్తనాల సేకరణ నిబంధనకు విరుద్ధం. బ్యారేజీ గేట్లకు కొందరు రంధ్రాలు చేసి గొట్టాలు అమర్చి ఈ పని చేస్తున్నారు. విజ్జేశ్వరం నుంచి ధవళేశ్వరం వరకు ఉన్న గోదావరి నాలుగు పాయల్లో రోజుకు వెయ్యి లీటర్లకు పైగా ఈ విత్తనాలు సేకరిస్తున్నట్లు అంచనా. లీటరు ధర సుమారు రూ.300 ఉండటంతో గిరాకీ ఉన్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. బొబ్బర్లంకలో మత్స్యశాఖ కార్యాలయం ఉన్నా దృష్టి పెట్టడంలేదు.


లాకు ఛాంబర్ తలుపులకు కట్టిన బుట్టలు.. (అంతర్‌చిత్రంలో) విత్తనం

నీటి వృథా.. సరిహద్దు వివాదాలు

ఇప్పటికే గేట్లు తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్నాయి. వీటికి తోడు రంధ్రాలు చేస్తుండడంతో జలాలు వృథాగా పోతున్నాయి. రబీ పంట కాలంలో గోదావరికి నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు ఈ జలాలు ఎంతో కీలకం. ఫలానా నంబరు గేటు వరకు తమదంటూ సరిహద్దులు నిర్దేశించుకుని దందా సాగిస్తున్నారు. గతంలో బొబ్బర్లంక, ధవళేశ్వరం రహదారుల మధ్య వివాదం ఏర్పడి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తగా పోలీసులు జోక్యం చేసుకున్నారు. పటిష్ఠ నిఘాకు సీసీ కెమెరాలు పెడతామని చెప్పినా ఆ దిశగా చర్యలు లేవు. ప్రస్తుతం వరద తగ్గడంతో బ్యారేజీ వద్ద నిత్యం 100 మంది వరకు దందా సాగిస్తున్నట్లు జలవనరులశాఖ అధికారులు గుర్తించారు. వైకాపా పాలనలో నాయకుల జోక్యంతో దోపిడీకి అడ్డుకట్టపడలేదు. ఇప్పుడైనా దృష్టిసారిస్తే మేలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పిబరే రామరసం



రాజమహేంద్రవరం సాంస్కృతికం: వాల్మీకి జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం రోటరీ కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు గురువారం వినూత్న ప్రయత్నం చేశారు. రామాయణంలోని పాత్రలను కళ్లకు కట్టేలా వేషధారణలతో ఆకట్టుకున్నారు.

దారంతా గుంతలు.. వైకాపా గంతలు

- నాడు బిల్లులు చెల్లించక గుత్తేదారుల డీలా
- మరమ్మతుల పనులకు టెండర్లలో మిశ్రమ స్పందన
- కూటమి ప్రభుత్వ చొరవతో తాజాగా ఆశలు


అధ్వానంగా పోతవరం ఆర్‌అండ్‌బీ రహదారి

కాకినాడ కలెక్టరేట్, పి.గన్నవరం, న్యూస్‌టుడే: గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు చుక్కలు చూపించింది. ఏ అభివృద్ధి పనులు చేసినా బిల్లులు చెల్లించకపోవడం వారికి తీవ్ర నిరాశ మిగిల్చింది. ఇది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతుల పనులపైనా ప్రభావం చూపింది. చిన్న గుత్తేదారులకు బిల్లులు ఎగ్గొట్టడంతో గుంతలు పూడ్చడానికి ఎవరూ ముందుకురాలేదు.

ఇదీ గుంతలు, మరమ్మతుల టెండర్ల పరిస్థితి

జిల్లా	ప్రతిపాదించిన పనులు	పొడవు (కి.మీ)	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
కాకినాడ	42	126	7.39
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	71	265	17.68
తూర్పుగోదావరి	35	91	7.74

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జూన్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లో గుంతలు పూడ్చడం, మరమ్మతులకు కాకినాడ సర్కిల్ ఆర్‌అండ్‌బీ కార్యాలయం ప్రతిపాదనలు పంపింది. ఆమోదం రావడంతో గతనెలాఖరున కాకినాడ, పెద్దాపురం, అమలాపురం, రాజమహేంద్రవరం డివిజన్ల పరిధిలో రూ.32.81కోట్ల విలువైన 148 పనులకు టెండర్లు ఆహ్వానించారు.. ఈనెల 15తో గడువు ముగిసింది. రూ.13.97 కోట్ల విలువైన 71 పనులకు బిడ్లు దాఖలు కాగా, రూ.18.84కోట్ల విలువైన 77 పనులకు ఒక్క టెండరూ రాలేదు. రూ.40 లక్షలకు పైబడి రూ.5 కోట్ల విలువైన 7 పనులకూ ఇదే పరిస్థితి. బిడ్లు దాఖలైనవాటికి అగ్రిమెంట్లు పూర్తి చేసి, నవంబరు మొదటి వారం నుంచి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ జి.కంఠ తెలిపారు. మిగతా 77 పనులకు రీ-టెండర్లు పిలుస్తామన్నారు.

తూర్పుగోదావరి జిల్లా: 35 పనులకు టెండర్లు పిలవగా, రూ.4.55 కోట్ల విలువైన 26 పనులకు టెండర్లు పడ్డాయి. రూ.3.19 కోట్ల విలువైన 9 పనులకు బిడ్లు రాలేదు.

■ రూ.29కోట్ల బకాయిలు: గత రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో చేపట్టిన రహదారుల మరమ్మతుల పనులకు చిన్న గుత్తేదారులకు రూ.29కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. వీరితో రూ.10 లక్షల నుంచి రూ.50లక్షల లోపు పనులు చేసిన వారే. దశలవారీగా చెల్లింపులు చేపడితే కొత్త పనులకు బిడ్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

■ మరో రూ.22.81 కోట్ల పనులకు ఆమోదం: ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన వానలతో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ.22.81 కోట్లతో అదనపు ప్రతిపాదనలు పంపగా తాజాగా ఆమోదం రానుంది. రాష్ట్ర వ్యాప్తంగా మరమ్మతులకు రెండో విడత నిధులిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రకటించిన నేపథ్యంలో గుత్తేదారులు ముందుకు వచ్చే అవకాశముంది.

■ రూ.90కోట్ల బిల్లుల చెల్లింపు: ఉమ్మడి జిల్లా పరిధిలో గత అయిదేళ్లలో సీఆర్‌ఎఫ్, ఎన్‌డీబీ ద్వారా చేపట్టిన పనులకు రూ.300 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి రెండు రోజుల క్రితం రూ.90 కోట్ల వరకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. దీంతో కీలకమైన సామర్లకోట-రాజానగరం రహదారి పనుల్లో కదలిక వచ్చింది. సీఆర్‌ఎఫ్ పనులు పూర్తి చేసేందుకు గుత్తేదారులు చొరవ చూపుతున్నారు.

పరమానందం.. పరంధాముడి పరిణయం


కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం ద్వారకా తిరుమల శ్రీనివాసుడు పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పరిణయమాడిన ఘట్టం భక్తులకు నయనానందం పంచింది. ఆశ్వయుజ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయానికి తూర్పు వైపున ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను వేర్వేరు వాహనాలపై మండపానికి తీసుకొచ్చారు. సుముహూర్త సమయాన జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, దేవస్థానం ఛైర్మన్ సుధాకరరావు, ఈవో మూర్తి, అనువంశిక ధర్మకర్త నివృతరావు ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవం అనంతరం వెండి గరుడ, సింహ వాహనాలపై గ్రామోత్సవాలు నిర్వహించారు. స్వామివారు మోహిని అలంకరణలో దర్శనమిచ్చారు.

ఉత్సవాల్లో నేడు: కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఏడు గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటుంది.

నకిలీలలు

అన్నవరంలో వసతి గదులకు ఫోర్జరీ రసీదుతో హల్‌చల్

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో వసతి గదుల కేటాయింపునకు సంబంధించి నకిలీ రసీదును అధికారులు గుర్తించారు. సత్యగిరిపై హరిహరసదన్ వసతి సముదాయంలో నాలుగు గదులు ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్నానని.. తనకు కేటాయించాలని ఓ వ్యక్తి బుధవారం రాత్రి వచ్చారు. రసీదు పరిశీలించిన అధికారులు వివరాల్లో తేడా కనిపించి నకిలీగా గుర్తించారు. దీనిపై ప్రశ్నించడంతో జారుకున్నాడు. సాధారణంగా ఒక రసీదుకు ఒక గదిని మాత్రమే కేటాయిస్తారు. కానీ నకిలీ రసీదుపై నాలుగు గదులు, రూ.8 వేల మొత్తం అని ఉంది. ఉద్యోగి సంతకం కూడా ఫోర్జరీ చేసి ఉంది. ఈ ఏడాది ఆగస్టులో విష్ణుసదన్ హాలును ఓ భక్తుడు ముందస్తు రిజర్వేషన్ చేసుకోగా ఆ పత్రాన్ని సేకరించి వివరాలు తమకనుకూలంగా మార్చి ఫోర్జరీ చేసినట్లు భావిస్తున్నారు. అతడిని ఎవరైనా వ్యక్తులు మోసం చేశారా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. వసతి గదులకు ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని నగదు వసూలు చేసి బోల్తాకొట్టి ఉండొచ్చని తెలుస్తోంది.

దళారుల హవా: గదుల ఆన్‌లైన్ బుకింగ్‌లో కొందరు దళారులు మోసాలకు పాల్పడుతున్నారు. సాధారణంగా 30 రోజులముందే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చు. వివిధ పేర్లతో ఆధార్ నకళ్లను సేకరించి గదులను దళారులు దక్కించుకుంటున్నట్లు తెలుస్తోంది. గదులు కేటాయించే సమయంలో ఎవరి ఆధార్‌తో ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్నారో ఆ వ్యక్తే రావాలి. ఆధార్ ఎవరు తెచ్చినా గది కేటాయిస్తుండటంతో మోసాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

రేవుల్లో ప్రత్యక్షం.. ఆన్‌లైన్‌లో అదృశ్యం

- ఇదీ ఇసుక సరఫరా తీరు
- భారీ వాహనాల్లో తరలింపు


గాయత్రి ర్యాంపులో ఇసుక నిల్వ

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

ఇసుక ఆన్‌లైన్‌లోనే కాదు.. ఆఫ్‌లైన్‌లోనూ పొందవచ్చు.. ఇదీ అధికారుల మాట.

ఆన్‌లైన్‌లో చూస్తే ఆయా ర్యాంపుల్లో ఇసుక నిల్ అంటూ చూపిస్తోంది. రేవుల్లో మాత్రం భారీ లారీల్లో పెద్ద మొత్తంలో తరలిపోతోంది. ఆఫ్‌లైన్‌లో రేవు వద్ద ఇసుక కోసం వెళ్తున్న సామాన్యులు ఇదేంటని ప్రశ్నిస్తే.. అదంతే..! అనే సమాధానం ఎదురవుతోంది.

ఇంటి అవసరాలకు రోజుకు లారీ, రెండు లారీలకు మించి ఇసుక అవసరం ఉండదు. అలాంటిది ఆఫ్‌లైన్ పేరిట అవకాశంతో రేవుల్లో ఏకమొత్తంగా 20 టన్నుల లారీలు ప్రత్యక్షమవుతున్నాయి. గురువారం గాయత్రి ర్యాంపులో పలు భారీ లారీల్లో ఇసుక తరలిపోయింది. 20 టన్నుల ఏకమొత్తంలో బుక్ చేసినట్లు బిల్లులు చూపిస్తున్నారు. అక్కడకు వచ్చిన సామాన్యుడికి మాత్రం.. లారీ ఇసుక కూడా లేదనే సమాధానం సిబ్బంది చెబుతున్నారు.

అడిగితే లేదంతే..

◆ నగరానికి చెందిన సత్యనారాయణ ఇంటి పనుల నిమిత్తం ఇసుక కోసం ఆన్‌లైన్‌లో ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడా దగ్గర్లో ర్యాంపుల్లో ఇసుక చూపించడం లేదు. దీంతో రేవుల్లో చూద్దామని గాయత్రి ర్యాంపునకు వెళితే అక్కడ భారీ లారీలతో ఇసుక తరలిపోతోంది. అవాక్కయిన ఆయన ర్యాంపు వద్ద రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఇసుక ఆఫ్‌లైన్‌లో లేదని, కేవలం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సమాధానం ఇచ్చారు. అక్కడే ఆన్‌లైన్‌లో బుక్ చేసేందుకు ప్రయత్నిస్తే గాయత్రి ర్యాంపులో ఇసుక ఉన్నట్లు చూపించడం లేదు. ర్యాంపుల నుంచి మాత్రం లారీలతో తరలిపోతోంది.

◆ నగరానికి చెందిన మధు ఇసుక కోసం రెండు వారాలుగా తిరుగుతున్నారు. గాయత్రి ర్యాంపులో తవ్వకాలు జరుగుతున్నాయని తెలుసుకుని వెళ్లారు. ముందుగా బుక్ చేసుకుని రావాలని సిబ్బంది నుంచి సమాధానం ఎదురైంది. ఆన్‌లైన్‌లో బుక్ చేద్దామంటే అవ్వక.. ఆఫ్‌లైన్ ఇవ్వక.. ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఎందుకిలా?

ఇసుక ర్యాంపుల విషయంలో అంతా అయోమయంగా మారింది. ధవళేశ్వరం, గాయత్రి ర్యాంపులు, కోటిలింగాల రేవులో కొన్నింటికి ప్రస్తుతానికి అనుమతులు లభించాయి. దీంతో తవ్వకాలు ఆరంభమయ్యాయి. ఆన్‌లైన్‌లో ఎక్కడా ఇసుక బుక్ కావడం లేదు. ఏ ర్యాంపులోనూ నిల్వలు లేనట్లే చూపిస్తోంది. ఆఫ్‌లైన్ విషయంలోనూ లేదనే సమాధానమే. అనుమతులు పొందిన ర్యాంపుల్లో వీఆర్వోలు తప్ప.. ఎక్కడా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. సామాన్యులు రేవుల వద్దకు ఇసుక కోసం వెళ్తున్నా నిరాశే ఎదురవుతోంది. ఎక్కడా రెండు యూనిట్ల చిన్న లారీలు లేవు. అన్నీ పెద్ద లారీలే. ఈ ఇసుక ఎవరు, ఎక్కడికి తరలించేస్తున్నారనేది స్పష్టత లేకుండా పోయింది. దీంతో కొంత మంది రేవుల వద్ద ఆందోళనకు దిగారు. రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. 20 టన్నుల లారీలకు స్లిప్‌లు పట్టుకొస్తున్నారని, మేము అనుమతించక తప్పదని అధికారులు సమాధానం ఇస్తున్నారు.

ఉద్యోగ మేళా రేపు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: వికాస ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వికాసా ప్రాజెక్టు డైరెక్టరు కె.లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో పలు సంస్థల్లో మార్కెటింగ్, రికవరీ, సిస్టమ్ ఆపరేటర్స్, కంపెనీలలో టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలకు ముఖాముఖీ నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులై 30 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు.

అనపర్తిలో అత్యధిక వర్షపాతం

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో గడిచిన 24 గంటల్లో(గురువారం ఉదయం 8.30 గంటల వరకు) అనపర్తి మండలంలో అత్యధికంగా 22.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా.. అత్యల్పంగా సీతానగరం మండలంలో 1.8 మిమీగా నమోదైంది. చాగల్లులో 17.4, రాజమహేంద్రవరం గ్రామీణంలో 15.2, బిక్కవోలులో 12.2, దేవరపల్లిలో 8.6, రాజానగరంలో 8.6, గోకవరం 8.4, ఉండ్రాజవరం 5.8, నల్లజర్ల 5.2, కడియం 4.8, రాజమహేంద్రవరం అర్బన్ 4.6, రంగంపేట 4.4, తాళ్లపూడి 4, పెరవలి 3.8, కొవ్వూరు 3.4, నిడదవోలు 3.2, గోపాలపురం 3 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.


చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

వి.ఎల్.పురం, శ్యామలా సెంటర్ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ ప్రశాంతి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు, డీఆర్వో నరసింహులు, జిల్లా బీసీ సంక్షేమాధికారి శశాంక, గిరిజన సంక్షేమాధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు ఇతర అధికారులు పాల్గొన్నారు. ■ మానవ సంబంధాలు, విలువలను శ్రీరాముని చరిత రామాయణం ద్వారా సమాజానికి అందించిన మహర్షి వాల్మీకి అని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీలు, సిబ్బంది పాల్గొన్నారు.


కరుణించు.. కల్పవల్లి

దేవరపల్లిలోని పల్లపు వీధి రామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని గురువారం ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. ఈ వాహన అలంకరణకు రూ.లక్ష ఖర్చు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక వేషధారణలు, గరగ నృత్యాలు, డీజే బాక్సులతో యువత ఊరేగింపులో సందడి చేశారు. -న్యూస్‌టుడే, దేవరపల్లి

డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 6,100 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 1300, 1800, 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం కొనసాగుతోందన్నారు. 55,862 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు వివరించారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పులగుర్త చేనేత వస్త్రాలకు మరింత ప్రాచుర్యం

రాజమహేంద్రవరం కలెక్టరేట్: పులగుర్త చేనేత వస్త్రాలకు మరింత ప్రాచుర్యం కల్పించి అందరికీ చేరువ చేసేందుకు తగు సూచనలు, ప్రతిపాదనలు ఇవ్వాలని కలెక్టర్ ప్రశాంతి కోరారు. చేనేత, ఇతర అనుబంధ శాఖల అధికారులు, పులగుర్త, మురమండ సొసైటీ సభ్యులతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చేనేత వస్త్రాలకు విలువ ఆధారిత గుర్తింపు తీసుకురావాల్సి ఉందన్నారు. ఈ వస్త్రాలతో పాలిటెక్నిక్, ఇతర కళాశాల విద్యార్థులతో ఫ్యాషన్ షో ఏర్పాటు చేయాలన్నారు. నేటి యువత కుర్తా, పైజామా, యువతులు పంజాబీ డ్రెస్, ఇతర ఆకట్టుకునే వస్త్రధారణపై ఆసక్తి చూపుతున్న దృష్ట్యా పులగుర్తి చేనేత దుస్తులను ఆ తరహాలో డిజైన్ చేసి మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జాతీయ స్థాయి చేనేత వస్త్ర ప్రదర్శనలో పులగుర్త చేనేత వస్త్ర స్టాల్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా చేనేత జౌళి అధికారి, ఇన్‌ఛార్జి ఉపసంచాలకుడు పెద్దిరాజు, పులగుర్త, మురమండ సొసైటీల కార్యదర్శులు సత్యనారాయణరాజు, పోతురాజు, అభివృద్ధి అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అభ్యాసనంపై 5 నుంచి శిక్షణ

రాజమహేంద్రవరం కలెక్టరేట్: 'ఉల్లాస్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని డిజిటల్ అభ్యాసనంపై నిరక్షరాస్యత కలిగినవారిలో అవగాహన పెంపొందించేందుకు నవంబరు 5 నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. వయోజన విద్య, ఇతర అనుబంధ శాఖల అధికారులతో 'ఉల్లాస్' కార్యక్రమంపై గురువారం కమిటీ సమావేశాన్ని వర్చువల్ విధానంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, డిజిటల్ అభ్యాసనంపై డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేసే నిరక్షరాస్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు, వీవోలను గుర్తించి శిక్షణ అందించేందుకు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో 5,087 మందిని గుర్తించి, నవంబరు 5 నుంచి 15 వరకు మాస్టర్ ట్రైనర్ల ద్వారా 200 గంటల పాటు శిక్షణ ఇచ్చేందుకు తేదీలు ఖరారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయుల ధర్నా

శ్యామలా సెంటర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో అర్హులైన స్కూలు అసిస్టెంట్లకు పదోన్నతి ఇవ్వాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 24న విద్యాశాఖ డైరక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామన్నారు. అనంతరం డీఎస్ఈఓ కె.వాసుదేవరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌బాబు, జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు, ఈ.శ్రీమణి, రమేష్‌బాబు, నగర అధ్యక్షుడు జేవీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


డీఎస్ఈవోకు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు



ఎంపిక పోటీల్లో క్రీడాకారులు

ఉత్సాహంగా ఫుట్‌బాల్‌ జట్ల ఎంపిక

శ్యామలాసెంటర్‌: స్కూలు గేమ్స్‌ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో అండర్‌-14 బాల, బాలికల ఫుట్‌బాల్‌ జిల్లా జట్ల ఎంపిక గురువారం ఉత్సాహంగా జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 80 మంది క్రీడాకారులు హాజరవ్వగా ప్రతిభ కనబరిచిన పలువురిని ఎంపిక చేసినట్లు స్కూల్‌ గేమ్స్‌ సంఘ కార్యదర్శి స్వామి, శిరం గంగాధర్‌ పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా డీవైఈఓ ...

డ్రాగా ముగిసిన మ్యాచ్‌

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్‌-14 మల్టీడే క్రికెట్‌ టోర్నీలో మ్యాచ్‌ డ్రా ముగిసింది. కడప కేఓఆర్‌ఎం మైదానంలో పశ్చిమ గోదావరితో జరిగిన మ్యాచ్‌లో తూ.గో జట్టు మొదటి ఇన్నింగ్స్‌ ఆధిక్యంతో నిలిచింది. టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ ప్రారంభించిన తూ.గో జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 127/5 స్కోరు చేసింది. కార్తీక్‌ 65, రాజేంద్రన్‌ 20 పరుగులు చేయగా, కార్తీక్‌ వర్మ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌ ప్రారంభించిన ప.గో జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి నిర్ణీత 25 ఓవర్లలో 99/4 స్కోరు చేసింది. దీంతో మ్యాచ్‌ డ్రాగా ముగిసింది.

ఐపీఏ విద్యా విభాగం ఛైర్మన్‌గా సుమలత



సుమలతకు నియామకపత్రం అందజేస్తున్న ప్రముఖులు

కోరుకొండ, న్యూస్‌టుడే: ఇండియన్‌ పార్లమెంటరీ స్టడీస్‌ అసోసియేషన్‌ విద్యా విభాగం ఛైర్పర్సన్‌గా కోరుకొండ మండలం నిడిగట్ల వికాస్‌ పాఠశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ జి.సుమలత ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి ముంబయిలోని ఐపీఏ కేంద్ర కార్యాలయంలో ... ఆమె ప్రమాణస్వీకారం చేశారు. ... కళాశాల ఛైర్మన్‌ తన్నీరు చినబ్బాయి, కార్యదర్శి భరత్‌ వికాస్‌ తదితరులు అభినందించారు.

అర్ధరాత్రి అక్రమ గ్రావెల్‌ తవ్వకాల అడ్డగింపు

కలవచర్ల (రాజానగరం), న్యూస్‌టుడే: కలవచర్లలో అక్రమ గ్రావెల్‌ తవ్వకాలను రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అడ్డుకున్నారు. ప్రొక్లెయిన్, లారీలను పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి జరగ్గా.. ఆ వివరాలను ఆయన గురువారం విలేకరులకు వెల్లడించారు. అధికార పార్టీ అండదండలతో గత రెండు నెలలుగా జరుగున్న ఈ తంతుపై.. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. వైకాపా కంటే ఎక్కువ పథకాలు అమలు చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. దోచుకోవడమే అజెండాగా ప్రభుత్వం పనిచేస్తోందని.. అందుకు నిదర్శనంగా సీతానగరం రోడ్డు, ఎన్‌డీబీ పనులను పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. తాము రాజానగరంలో రూ.215 కోట్లతో వాటర్‌ గ్రిడ్‌ పథకం, సుమారు రూ.100 కోట్లతో రివర్స్‌ పంపింగ్‌ స్కీమ్‌ తీసుకొచ్చినట్లు చెప్పారు. కలవచర్లలో సుమారు వంద ఎకరాల్లో పారిశ్రామికవాడ మంజూరు చేశామన్నారు. మౌలిక వసతుల కోసం మరో రూ.22 కోట్లు మంజూరు చేయించామన్నారు. అక్రమ గ్రావెల్‌ తవ్వకాలపై అధికారులు స్పందించాలని కోరారు. విజిలెన్స్, పోలవరం ప్రాజెక్టు అధికారులకూ ఫిర్యాదులు అందజేస్తామన్నారు. జక్కంపూడి గణేష్‌, అడబాల చిన బాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రావెల్‌ లారీని పోలీసులకు అప్పగిస్తూ..

ఆశల పల్లకిలో ఆశావహులు

● సాగునీటి సంఘాలపై నేతల దృష్టి ● అప్పుడే మొదలైన పైరవీలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం, ముమ్మిడివరం

గత తెదేపా హయాంలో వంట, మురుగు కాలువలు, సాగు నీటి పట్టుల నిర్వహణ పనులను సాగు నీటి సంఘాల ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించే వారు. ... సాగు నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం ... ఈ నెల 16న ఎన్నికలకు ప్రకటన ... సాగు నీటి సంఘాల ప్రతినిధులుగా ... తెదేపా, జనసేన, భాజపా నేతలు పలువురు సాగు నీటి సంఘాల ప్రతినిధులు కావాలని ఉవ్విళ్లూరుతున్నారు.

సాగు నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ... గతంలో ఉన్న సాగు భూముల ... తాజాగా ఓటర్ల జాబితాలను రూపొందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా

గోదావరి డెల్టా సిస్టమ్‌ పరిధిలో 144 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 25 నీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. ● ఏలేరు రిజర్వాయర్‌ ప్రాజెక్టు పరిధిలో 25 సాగునీటి సంఘాలు, ఐదు నీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● తొర్రిగడ్డ పంపింగ్‌ స్కీమ్‌లో నాలుగు సాగు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● పంపా రిజర్వాయర్‌ ప్రాజెక్టులో ఆరు సాగు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● సుబ్బారెడ్డిసాగర్‌ ప్రాజెక్టులో ఆరు సాగునీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ● మైనర్‌ ఇరిగేషన్‌ ప్రాజెక్టుల పరిధిలో 216 సాగు నీటి సంఘాలు ఉన్నాయి.



పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టు

తమ స్థాయిని బట్టి..

నాయకులు తమ స్థాయినిబట్టి అధ్యక్షులు, నీటి పంపిణీ కమిటీ ఛైర్మన్‌ పదవులను కొందరు, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ కావాలని మరికొందరు ఆశిస్తున్నారు. ... ఇందుకోసం టీడీపీ, జనసేన నేతలను ఆశావహులు కలిసి తమకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గతంలోని కమిటీలన్నింటికీ..

సాగునీటి సంఘాలకు సంబంధించి ఓటర్ల జాబితాలు తయారు చేస్తున్నాం. దాదాపుగా గతంలో ఉన్న కమిటీలకు ఎన్నికలు జరుగుతాయి. నోటిఫికేషన్‌ వాయిదా పడటంతో షెడ్యూల్‌లో కూడా మార్పులు ఉంటాయి.

- ఎన్‌.పుల్లారావు, చీఫ్‌ ఇంజినీర్, గోదావరి డెల్టా సిస్టమ్‌

వైద్య చికిత్సల్లో ఫిజియోథెరపీ కీలకపాత్ర

రాజానగరం, న్యూస్‌టుడే: వైద్య చికిత్సల్లో ఫిజియోథెరపీది కీలకపాత్ర అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మెడికల్‌ ఎడ్యుకేషన్‌ డైరెక్టర్‌ (అకడమిక్‌) డా.జి.రఘునందన్‌ అన్నారు. జీఎస్‌ఎల్‌ వైద్య కళాశాలలో ఫిజియోథెరపీ కోర్సును పూర్తి చేసిన 2019 - 24 బ్యాచ్‌ పీజీ, యూజీ వైద్యులు 108 మందికి గురువారం పట్టాల ప్రదానం చేశారు. ... కార్యక్రమంలో డా.గన్ని భాస్కరరావు, సూపరింటెండెంట్‌ డా.టి.వి.ఎస్‌.పి.మూర్తి, డా.అప్పారావు, డా.చతుర్వేది, డా.ఎస్‌.కె.మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



ఫిజియోథెరపీలో టాపర్‌గా నిలిచిన సాయివైష్ణవికి పట్టాను ప్రదానం చేస్తున్న ముఖ్య అతిథులు

జె.తిమ్మాపురానికి రూ.25 లక్షలతో ఆర్వో ప్లాంటు


పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురం గ్రామస్థుల స్వచ్ఛమైన నీరు తాగేందుకు నెక్కంటి సీఫుడ్స్‌ కంపెనీ ఎండీ నెక్కంటి వెంకట్రావు రూ.25 లక్షల విలువైన ఆర్వో వాటర్‌ ప్లాంటును బుధవారం బహూకరించారు. ... కంపెనీ అడ్మినిస్ట్రేషన్‌ మేనేజర్‌ గోపీచంద్‌ తదితరులు పాల్గొన్నారు.



నెక్కంటి సీఫుడ్స్‌ ఇచ్చిన ప్లాంటును ప్రారంభిస్తున్న అమెరికా ప్రతినిధులు

జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మిక మృతి

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు గురువారం ఉదయం గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ... ప్రైవేటు ఆసుపత్రిలో ఉదయం 6.30 గంటలకు స్టంట్‌ వేసేందుకు ఏర్పాట్లు చేయగా.. 6.45 గంటలకు మరోసారి గుండెపోటు రావడంతో మృతిచెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరూ ఎంబీబీఎస్‌ డాక్టర్లు. డీపీఓ మృతదేహాన్ని ఆయన ... విశాఖపట్నంలో జిల్లా పరిషత్‌ అకౌంట్స్‌ అధికారిగా, డిప్యూటీ సీఈవోగా, డ్వామా పీడీగా విధులు నిర్వహించారు.



శ్రీనివాసరావు (పాతచిత్రం)

నివాళులర్పించిన కలెక్టర్‌

డీపీఓ శ్రీనివాసరావు మృతి పట్ల జిల్లా కలెక్టర్‌ పి.ప్రశాంతి, జేసీ చిన్నరాముడు, డీఆర్‌ఓ నరసింహులు సంతాపం తెలిపారు. ... సమర్థవంతంగా నిర్వహించడం, ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి పనులు చేపట్టేందుకు ముందుండేవారని కొనియాడారు. ఆయన మృతి తీరని లోటని అన్నారు. మౌనం పాటించి నివాళులర్పించారు.



నర్సుల ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్‌ సభ్యులు ఏకగ్రీవం

మసీదు సెంటర్‌(కాకినాడ): ఏపీ ప్రభుత్వ నర్సెస్‌ అసోసియేషన్‌ ఉమ్మడి జిల్లా సంఘ ఎన్నికలకు సంబంధించి మొత్తం 17 నామపత్రాలు దాఖలయ్యాయి. వాటిని పరిశీలించగా, ఒకటి సరిగా లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారి టి.నందన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలిన 16 సక్రమంగా ఉన్నాయన్నారు. ఎగ్జిక్యూటివ్‌ సభ్యుల పదవులకు వచ్చిన ఆరు నామపత్రాల్లో ఒకటి తిరస్కరణకు గురవ్వడంతో అయిదు మాత్రమే మిగలడంతో ఏకగ్రీవం అయ్యాయని ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు 23న ఎన్నికలు జరుగుతాయన్నారు. 18 సాయంత్రం 5 గంటల వరకూ నామపత్రాల ఉపసంహరణకు గడువు ఉందన్నారు.

ఎఫ్‌ఏసీ బాధ్యతల అప్పగింత

ధవళేశ్వరం: జలవనరులశాఖలో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈలకు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ధవళేశ్వరం పోలవరం ఇరిగేషన్‌ ప్రాజెక్టు ఎల్‌ఎంసీ డివిజన్‌లో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈ కె.శ్రీనివాసరావుకు పీఐపీ ఎల్‌ఎంసీ డివిజన్‌ ఎలమంచిలి, తుని పీఐపీలో ఎస్‌ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గన్నవరం పీఐపీ ఆర్‌ఎంసీ సబ్‌డివిజన్‌లో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న ఎం.కిషోర్‌కు డ్రైనేజీ డివిజన్‌ కాకినాడ ఇరిగేషన్‌ సర్కిల్, ధవళేశ్వరంలో ఎఫ్‌ఏసీ బాధ్యతలు ఇచ్చారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టాగ్రామ్‌ పరిచయం

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

రాజానగరం: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఓ వివాహిత ఆత్మహత్యకు దారితీసింది. ఈ ఘటన రాజానగరం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని చక్రద్వారబంధంలో జరిగింది. దీనికి సంబంధించి సీఐ ఎస్‌.పి.వీరయ్యగౌడ్‌ తెలిపిన సమాచారం మేరకు.. చక్రద్వారబంధానికి చెందిన మహిళకు వివాహమై ఒక పాప ఉంది. ఆమెకు దాదాపు సంవత్సరం క్రితం విశాఖపట్నానికి చెందిన ఒక అపరిచిత వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. అనంతరం ఆమెను బెదిరించి బంగారు వస్తువులు తీసుకున్నాడు. తిరిగి వాటిని ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడు. ఈ నేపథ్యంలో ఆమె ఇంట్లో గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన మహిళ ఈ నెల 16వ తేదీన తన పుట్టింటికి వచ్చి.. అర్ధరాత్రి దాటాక చీరతో సీలింగ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నవోదయ 9, 11 తరగతుల్లో చేరేందుకు అవకాశం

పెద్దాపురం: పెద్దాపురం జవహర్‌ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 9, 11వ తరగతిలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్‌ ప్రిన్సిపల్‌ రామకృష్ణయ్య గురువారం తెలిపారు. కాకినాడ, అంబేడ్కర్‌ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన విద్యార్థులు అవకాశం వినియోగించుకోవచ్చన్నారు. దరఖాస్తులను నవోదయ వెబ్‌సైట్‌ ద్వారా చేసుకోవాలన్నారు.

మాలాంటి కడుపుకోత ఎవరికీ వద్దు

● గోదావరిలో మృతి చెందిన విద్యార్థి తండ్రి వేదన ● మునిగిన చోటనే తేలిన మృతదేహం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ‘మాలాంటి కడుపుకోత ఎవరికీ రాకూడదు. కంటికి రెప్పలా చూసుకుని ఎంతో అల్లారి ముద్దుగా పెంచుకున్నాం. ఉన్నత చదువులు పూర్తి చేసి కుటుంబానికి అండగా ఉంటాడని భావించా. ఎన్నో ఆశలు పెట్టుకుంటే అర్ధంతరంగా మాయమయ్యాడు. కళాశాలకు వెళ్లి వస్తామని చెప్పాడు.. ఇక్కడికి వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటాడని ఊహించలేదు. ఈ బాధను భరించలేక పోతున్నా. ఈ రేవు వద్ద మరొకరు ఇలా బలికాకుండా చర్యలు చేపట్టాలి. ఎవరు రాకుండా రహదారి ముఖద్వారం వద్ద గేట్లు ఏర్పాటు చేయాలి.’ ఇదీ కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ గోపులంక పుష్కర రేవు వద్ద గోదావరిలో మునిగి మృతి చెందిన ఇంజినీరింగ్‌ విద్యార్థి కుతాని సాయిచంద్ర(21) తండ్రి సురేష్‌ కన్నీటి వేదన. స్నేహితులతో కలిసి స్నానం చేసేందుకు బుధవారం పుష్కర రేవులో దిగిన సాయిచంద్ర గల్లంతు కాగా, గురువారం రాత్రి మృతదేహం లభించింది. రాజమహేంద్రవరం, తణుకు, తాడేపల్లి గూడెంనకు చెందిన ఏడుగురు ఇంజినీరింగ్‌ విద్యార్థులు యానాం విహార యాత్రకు వెళ్లి వస్తూ ఇక్కడ గోదావరిలో దిగిన సమయంలో అతడు గల్లంతైన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం ఎ.వి.అప్పారావు రోడ్డుకు చెందిన సాయిచంద్ర కుటుంబ సభ్యులు, బంధువులు, మిగిలిన ఆరుగురు విద్యార్థులు గురువారం రాత్రి వరకు గోదావరి ఒడ్డున మృతదేహం ఆచూకీ కోసం నిరీక్షించారు. తహసీల్దారు పితాని త్రినాథ్‌ ఆదేశాల మేరకు వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, నారాయణరావు, పంచాయతీ కార్యదర్శులు శివప్రసాద్, వల్లీబాబా, కోరంగి పోలీసు, తెదేపా నాయకుడు వేగేశ్న శ్రీనురాజుల పర్యవేక్షణలో గల్లంతైన నుంచి గురువారం రాత్రి వరకు గోదావరిలో గాలించారు. రెండు పడవలపై 14 మంది జాలర్లు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. చివరకు అతడు మునిగిపోయిన ప్రాంతంలోనే రాత్రి సమయానికి మృతదేహం తేలింది. కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఎస్‌డీఆర్‌ఎఫ్‌ ఆర్‌ఎస్సై శివకుమార్‌ బృందం గురువారం రాత్రి అక్కడికి చేరుకుంది. గాలింపు చర్యలపై ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌ తహసీల్దారుతో ఫోన్‌లో మాట్లాడారు.



విద్యార్థి తండ్రి సురేష్‌



గోపులంక పుష్కర రేవు వద్ద బాధిత కుటుంబ సభ్యులు, విద్యార్థులు

గంజాయితో పట్టుబడ్డ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు

హైదరాబాద్‌: వారంతా సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులే. కానీ, గంజాయికి బానిసై జైలు పాలయ్యారు. కేపీహెచ్‌బీ ఎస్సై సుమన్‌ వివరాల ప్రకారం. .గురువారం కేపీహెచ్‌బీ ఖాళీస్థలంలో కొందరు యువకులు గంజాయి పొట్లాలతో ఉన్నారన్న సమాచారంతో బాలానగర్‌ జోన్‌ ఎస్వోటీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. యువకులు పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోసమే గంజాయి తాగుతున్నట్లు వారు పోలీసులకు చెప్పడం గమనార్హం. కోనసీమ జిల్లా ఆలమూరు మండలానికి చెందిన తోరటి రాజేశ్‌(24), కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలానికి చెందిన నక్కా నాగవంశీ(23), తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు నరేంద్రపురం గ్రామానికి చెందిన తంగెళ్ల రమేశ్‌కృష్ణ(27), పల్నాడు జిల్లాకు చెందిన విహారి(26) సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు. రాజేశ్‌ కైత్లాపూర్‌లో, మిగతా ముగ్గురు కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని వసతి గృహాల్లో ఉంటున్నారు. రాజేశ్‌ గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. మిగతావారికి తాగడం అలవాటు చేశాడు. పోలీసులు సుమారు 1300 గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు వీరినుంచి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్‌ చికెన్‌ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్‌ లైవ్‌	152-00
డ్రెస్డ్‌	220-00
స్కిన్‌లెస్‌	251-00

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)



దేవీచౌక్: టమాట-38, వంకాయలు(నలుపు-30/గులాబీ-40/ తెలుపు-34/దొమ్మేరు-42), బెండ-25, కాకర-30, బీర(పందిరి)-32, దొండ-24, క్యారెట్-40, బీట్‌రూట్-36, గోరుచిక్కుళ్లు-30, దోస-34, ఆనబకాయ-35, చిక్కుళ్లు-72/దేశవాళీ-88, పచ్చిమిర్చి-40, బంగాళ దుంపలు-34, ఉల్లిపాయలు-50/కొత్తవి-32.

రాజమహేంద్రవరం

చలనచిత్రాలు దానవాయిపేట: శ్యామల: వేట్టయన్, ఊర్వశి: సత్యం సుందరం, సూర్యప్యాలస్: ఇద్దరు, రాజా: మార్టిన్, కుమారి, అప్సర: దేవర, అశోక: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, రంభ: రాధే కృష్ణ, మానాన్న సూపర్ హీరో(రెండేసి ఆటలు), మేనక: కల్లు కాంపౌండ్, మార్టిన్(రెండేసి ఆటలు), శివజ్యోతి, లవ్ రెడ్డి, ది డీల్(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, విశ్వం(రెండేసి ఆటలు).

వాల్మీకి రామాయణం అద్భుత గ్రంథం

రాజమహేంద్రవరం సాంస్కృతికం : వాల్మీకి మహర్షి రామాయణాన్ని అద్భుత విలువలతో రచించారని కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల సంస్కృత శాఖాధిపతి ప్రభల శ్రీవల్లి అన్నారు. ప్రసంగ తరంగిణి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం వాల్మీకి జయంతి సభ నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన ప్రభల శ్రీవల్లి 'వాల్మీకి కవిత్వ సౌందర్యం' అంశంపై ప్రసంగిస్తూ వాల్మీకి వంటి రుషులను స్మరించుకోవడం హిందూ ధర్మం లక్షణమన్నారు. రామాయణంలో వ్యక్తిత్వ వికాసం ఉందన్నారు. మహాకావ్యాలు మంచిని బోధిస్తాయన్నారు. తెలుగు అధ్యాపకురాలు బి. హెచ్. వి. రమాదేవి, బ్రహ్మశ్రీ కోట్ల సుబ్రహ్మణ్యశర్మ, బిక్కిన రామ మనోహర్, కాల్నాధభట్ల సత్యనారాయణ మూర్తి తదితరులు వక్తను సత్కరించారు.



కౌసల్య వేషధారణలో విద్యార్థిని హారిక



అశోక వనంలో త్రిజట, సీత



సీతారాములు వేషధారణలో విద్యార్థినులు



ఎస్‌కేవీటీ కళాశాలలో విజేతలకు బహుమతి అందిస్తున్న సప్పా దుర్గాప్రసాద్

రామాయణ గాథ వినుడీ మనసారా..

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : వాల్మీకి జయంతిని పురస్కరించుకుని రామాయణ కథను కళ్లకు కట్టారు కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు. సంస్కృత విభాగాధిపతి ప్రభల శ్రీవల్లి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు రామాయణ పాత్రలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రామాయణంలోని పాత్రలతో విద్యార్థినులు అలరించారు. ప్రిన్సిపల్ రాఘవ కుమారి మాట్లాడుతూ.. మహర్షి రచించిన శ్రీమద్రామాయణం భారతీయులకు పూజ్యనీయ గ్రంథమని పేర్కొన్నారు.

దేవీచౌక్: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ కె. రామచంద్రరావు, తెలుగు విభాగాధిపతి పి. ఎ. సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. ✦ ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల.. తెలుగు, సంస్కృత, హిందీ శాఖల నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. తెలుగు శాఖాధిపతి పి. వి. బి. సంజీవరావు, సంస్కృత ఆచార్యులు శ్రీనివాసరావు రామాయణ కావ్యంపై ప్రసంగించారు.



ఆర్ట్స్ కళాశాలలో..

వైభవంగా చండీహోమం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సీతంపేట మాతృరూపిణీ మందిరంలో దసరా ఉత్సవాల సందర్భంగా గురువారం చండీ హోమం నిర్వహించారు. అజ్జరపు హరిబాబు నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో వేదపండితులు శంకరం, గోరుగంతు సత్యనారాయణమూర్తి తదితరులు వైభవంగా హోమం జరిపించారు.

వరద బాధితులకు సహాయం

టి.నగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం రూ. 5 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కును అందించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమయం: ఉదయం 8 నుంచి 11 గంటల వరకు
ప్రాంతాలు: బాలాజీపేట, సావిత్రినగర్, ఆదర్శనగర్, రామకృష్ణనగర్

సమయం: ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
ప్రాంతాలు: సీతంపేట, ఎన్టీఆర్ కాలనీ, కృష్ణనగర్, మూలగొయ్యి

సమయం: ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
ప్రాంతాలు: హౌసింగ్ బోర్డు కాలనీ, స్పిన్నింగ్ మిల్లు ప్రాంతం, ఆటోనగర్, స్వరూప్‌నగర్

సమయం: ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
ప్రాంతాలు: కొంతమూరు గ్రామంలోని కంటిపూడి లేఔట్, క్రషర్స్ ప్రాంతం

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

టి.నగర్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించేదుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం తుమ్మలావ సాయిబాబా ఆలయం వద్ద 35, 36, 37, 38, 39, 40 డివిజన్లకు సంబంధించి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. గతంలో అర్హులైన వారికి కూడా పథకాలు అందించలేదన్నారు. ప్రస్తుతం అర్హతను బట్టి లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు.

టెట్‌కు 436 మంది హాజరు



అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న డీఐ

శ్యామలా సెంటర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ గురువారం జిల్లాలో ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం జరిగిన పరీక్షకు 240 మందికి 218 మంది, మధ్యాహ్నం 240 మందికి 218 మంది హాజరయ్యారని డీఎస్ఈఓ కె. వాసుదేవరావు చెప్పారు.

14 కోర్సులు.. 294 సీట్లు

ఆర్ట్స్ కళాశాలలో పీజీ ప్రవేశాలు

మొత్తం సీట్లలో..
రెగ్యులర్ కోటా : 114
సెల్ఫ్ ఫైనాన్స్ : 180

కోర్సుల్లో సీట్ల ఖాళీల వివరాలు

ఎంఏ		ఎమ్మెస్సీ	
తెలుగు	52	మ్యాథమ్యాటిక్స్	34
ఎకనామిక్స్	30	ఫిజిక్స్	24
పొలిటికల్ సైన్స్	25	ఆర్గానిక్ కెమిస్ట్రీ	2
ఎంకాం	40	ఫిజికల్ కెమిస్ట్రీ	5
		బోటనీ	19
		జువాలజీ	8
		కంప్యూటర్ సైన్స్	9
		ఆక్వాకల్చర్	13
		జియాలజీ	33

న్యూస్‌టుడే, దేవీచౌక్

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఏపీ పీజీసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశాలకు అర్హులు. మొత్తం 14 పీజీ కోర్సులకు సంబంధించి 294 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

విద్యార్థికి వచ్చిన ర్యాంకు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను భర్తీ చేయనున్నారు. మొదట వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. కళాశాల గ్రంథాలయం రిఫరెన్స్ సెక్షన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశాలు నిర్వహిస్తారు. ఏపీ పీజీసెట్-2024లో అర్హత సాధించి ర్యాంకు వచ్చిన విద్యార్థులు తమకు నచ్చిన కళాశాల, కోర్సుల్లో సీట్లు రానివారు స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చని కళాశాల ప్రిన్సిపల్ కె. రామచంద్రరావు వెల్లడించారు. రెగ్యులర్ కోటాలో ఫీజు తక్కువగా ఉంటుందని తెలిపారు.



ఆర్ట్స్ కళాశాలలోని పీజీ బ్లాక్

ఈ ధ్రువపత్రాలు తప్పనిసరి

- ✦ విద్యార్హత పత్రాలు(పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ మార్కుల జాబితా, ప్రొవిజనల్ సర్టిఫికెట్)
- ✦ ఏపీ పీజీసెట్-2024 ర్యాంకు కార్డు
- ✦ స్టడీ సర్టిఫికెట్
- ✦ నివాస ధ్రువీకరణ పత్రం(అవసరమైనవారు)
- ✦ కుల ధ్రువీకరణ పత్రం(అవసరమైనవారు)
- ✦ ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం(అవసరమైనవారు)
- ✦ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్
- ✦ వీటితోపాటు ఒక సెట్ నకలు కాపీలు తీసుకెళ్లాలి.

బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నందం గనిరాజు జంక్షన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. క్లబ్ అధ్యక్షుడు మద్దుల శ్రీరామగుప్తా మాట్లాడుతూ నిత్యం జన సందోహంతో ఉండే కూడలిలో విశాఖపట్నం, కాకినాడ, గోకవరం నుంచి వచ్చే బస్సు ప్రయాణికులకు అనువైన ప్రాంతంలో షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. నిర్మాణానికి అవసరమైన రూ. 1,70,000 లయన్స్ క్లబ్ సభ్యుడు గొల్లపూడి వీరవెంకటరమణ గొల్లపూడి వీరాస్వామి సన్స్ తరఫున అందిస్తున్నారన్నారు. క్లబ్ ప్రతినిధులు కుమారస్వామి, రాఘవరావు, గోపాలకృష్ణ, గ్రంధి వెంకటేశ్వరరావు, లక్ష్మీవసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

20న స్వర ప్రభంజనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం : శోభన్ బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు స్వర ప్రభంజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆనం కళాకేంద్రంలో జరిగే సంగీత విభావరిలో వర్ధమాన గాయని కోరుకొండ ప్రభ 116 గీతాలు ఆలపిస్తారన్నారు.

దయచేసి వినండి.. శునకాలతో సమస్యండి!

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్... నిత్యం 20 వేలకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రదేశం. సుమారు 80 ప్రయాణికుల రైళ్లు ఈ స్టేషన్ మీదుగా రోజూ పరుగులు పెడుతుంటాయి. ఇలాంటిచోట శునకాల బెడద ప్రయాణికులను భయపెడుతోంది. రైల్వేస్టేషన్ పశ్చిమ ద్వారం, జనరల్ టికెట్ కౌంటర్లు, ప్రయాణికుల నిరీక్షణ మందిరాలు, ప్లాట్‌ఫామ్‌లు ఇలా ఎక్కడపడితే అక్కడ కుక్కలు తిష్టవేసి ఉంటున్నాయి. రైళ్లు ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చి ఆగే సమయంలో ఎక్కి, దిగే హడావుడిలో చూసుకోకుండా పొరపాటున వీటిపై కాలు వేస్తే కరిచే ప్రమాదముందని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్ అధికారులు స్పందించి కుక్కల బెడద అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, వి.ఎల్.పురం



రైల్వేస్టేషన్ ప్రవేశ మార్గంలో..



ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై..

స్తంభాలు.. దారుల్లో గండాలు!

నగరంలో పలు ప్రాంతాల్లో రహదారులకు అడ్డంగా.. దారుల మలుపుల్లో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. పాదచారులు, వాహన చోదకులకు అవస్థలు తెచ్చి పెడుతున్నాయి. ప్రధాన మార్గాలు, వీధి దారులు ఎక్కడా ఇదే పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో పాత విద్యుత్తు స్తంభాలు చాలాకాలంగా అలానే వదిలేశారు. రహదారులు విస్తరించినా స్తంభాలు మాత్రం తొలగించలేదు. ఇప్పటికైనా వీటి తొలగింపునకు చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు



ఆల్కట్‌తోట రోడ్డు మలుపులో



రామకృష్ణ థియేటర్ వద్ద...



ఇన్నీసుపేటలో

గంజాయి తరలిస్తున్న ముగ్గురు రౌడీ షీటర్ల అరెస్టు

రాజమహేంద్రవరం నేరవార్తలు: గంజాయి తరలిస్తున్న ముగ్గురు రౌడీ షీటర్లను రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ దుర్గాప్రసాద్ వివరాల మేరకు.. నగరంలోని ఇన్నీసుపేటకు చెందిన యాదవ ప్రసాద్ అలియాస్ పాణిపూరి ప్రసాద్, ఆల్కాట్‌తోటకు చెందిన యర్ర గణేష్ అలియాస్ గంజి, ఉల్లితోట ప్రాంతానికి చెందిన గారపాటి దుర్గప్రసాద్‌లు రౌడీ షీటర్లు. వీరు గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో బుధవారం రైల్వే గూడ్స్ గేటు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద బ్యాగుల్లో 22.500 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరు విశాఖ ఏజెన్సీ నుంచి రైలు మార్గంలో గంజాయి తరలిస్తున్నట్లుగా విచారణలో తేలింది. హత్యాయత్నం, గంజాయి, కొట్లాటకు సంబంధించి యాదవ ప్రసాద్‌పై ఆరు, గణేష్‌పై 14, దుర్గాప్రసాద్‌పై ఏడు కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించడంతో కేంద్ర కారాగారానికి తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆటో ఢీకొని గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: కొంతమూరు ప్రాంతానికి చెందిన ఎం. చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై గురువారం ఉదయం రాజా థియేటర్ రోడ్డులో వెళ్తుండగా ఆటో ఢీ కొంది. ఆ ప్రమాదంలో అతడికి గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాయి.

మరో ప్రమాదంలో పాదచారుడికి..

శ్రీకృష్ణనగర్ ప్రాంతానికి చెందిన ఎన్. రఘునాథ్ బుధవారం రాత్రి ఐఎల్‌టీడీ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడి తలకు గాయం కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాన్‌హోల్ ముప్పు

నగరంలో డీలక్స్ సెంటరు వద్ద ట్రైనింగ్ కళాశాల వెనుక రోడ్డు మధ్యన మ్యాన్‌హోల్ పరిస్థితి ఇది. మూత లేకుండా దర్శనమిస్తోంది. పాదచారులు, వాహనచోదకులు అప్రమత్తంగా లేకపోతే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంది. నూతన మూత ఏర్పాటు చేయాలని, అంతవరకు కనీసం హెచ్చరిక బోర్డు పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు



సంస్కృతి.. సంప్రదాయాలు తెలుసుకుంటూ సైకిల్ యాత్ర



శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: రాజస్థాన్‌కు చెందిన కిషన్‌లాల్, మహిలాల్, కంబాలాల్, కన్నయ్యలాల్ విశాఖపట్నం నుంచి రాజస్థాన్ వరకు సైకిల్ యాత్రను బుధవారం ప్రారంభించగా గురువారం రాజమహేంద్రవరం వరకు చేరుకున్నారు. రాజస్థాన్‌లోని విష్ణావతారమూర్తి శ్రీదేవ్‌నారాయణ దర్శనార్థం 20 రోజులపాటు సాగే ఈ యాత్ర ద్వారా పలు ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలను సందర్శించటంతోపాటు అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుంటామన్నారు. వీరంతా విశాఖలో ఐస్‌క్రీం వ్యాపారం చేస్తుంటారు.

సైకిల్‌యాత్ర చేపడుతున్న మిత్రబృందం

తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు చర్యలు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కేతన్ గర్గ్ తెలిపారు. ఈ మేరకు గురువారం పుష్కరఘాట్ వద్ద తాగునీటి సరఫరా విభాగాన్ని పరిశీలించారు. నీటి శుద్ధీకరణ, పంపింగ్ విధానం, సరఫరా తదితర అంశాలను తెలుసుకున్నారు. శివారు ప్రాంతాల్లో తాగునీటి అవరోధాలను అధిగమించే విధంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈఈ మదర్సా అలీ, ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నదిలో పంపింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

'పథకం ప్రకారమే ఇంటి మీదకు వచ్చారు'

దేవీచౌక్: తనను అల్లరి చేసేందుకు పథకం ప్రకారమే యాంకర్ కావ్యశ్రీ, ఆమె తండ్రి తన ఇంటి మీదకు వచ్చారని వైకాపా నాయకుడు ఎన్వీ శ్రీనివాస్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. తన కుమారుడు విజయవాడలో ఒక ఫైనాన్సర్ వద్ద నుంచి రూ. 3 లక్షలు అప్పుగా తీసుకున్నారని తెలిపారు. దానికి కావ్యశ్రీ దగ్గర ఉండి ఇప్పించారా లేదా మధ్యవర్తిగా ఉండి ఇప్పించారా అనే విషయం తనకు తెలియదన్నారు. పది రోజుల క్రితం కావ్యశ్రీ తండ్రి వస్తే రూ. 50 వేలు సర్దుబాటు చేసి పంపానన్నారు. ఇలా మూడు సార్లు రూ. 50 చొప్పున తిరిగి ఇచ్చేశానని, మిగిలిన డబ్బులు తనకు అందగానే ఇచ్చేస్తానని గడువు అడిగానని, ఈ లోగానే ఇంటికి వచ్చి దౌర్జన్యం చేసి దుర్భాషలాడారని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి సహకారంతో పథకం ప్రకారం తనను అల్లరి చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. వెంటనే డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ కావ్యశ్రీ, ఆమె తండ్రి బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించాలని ప్రయత్నించారన్నారు. వారిని వారించి కిందకు తీసుకువచ్చి మాట్లాడేందుకు ప్రయత్నించానే తప్ప దాడి చేయలేదన్నారు. జరిగిన విషయంపై తాను ప్రకాశంనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు.

నమ్మకం.. ధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: క్యాన్సర్ వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని డెల్టా ఆసుపత్రికి చెందిన అంకాలజిస్ట్ సుమంత్ మండవ విద్యార్థులకు సూచించారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం జరిగింది. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, దానిని నిరోధించే మార్గాలు, ఆత్మవిశ్వాసంతో వ్యాధిని జయించిన విజేతల గురించి సుమంత్ వివరించారు. క్యాన్సర్ విషయంలో భయపడాల్సింది లేదని, నమ్మకం, ధైర్యంతో జయించవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓలు జి. వి. ఎస్. నాగేశ్వరరావు, బి. రమాదేవి, మహేశ్వరి, పి. సాయి తదితరులు పర్యవేక్షించారు. ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పౌర్ణమి పూజలు



గాయత్రీ పీఠంలో ...



అష్టలక్ష్మి ఆలయంలో...

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నగరంలోని ఆలయాల్లో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం విశేష పూజలు జరిగాయి. అక్షరకోటి గాయత్రీ పీఠంలో అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకం, మూలవిరాట్‌కు పట్టువస్త్రాలతో అలంకరించి కుంకుమార్చన నిర్వహించారు. వంకాయలవారి వీధిలోని అష్టలక్ష్మీ ఆలయంలో లక్ష్మీనారాయణుల మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణం జరిపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీ ప్రాంతంలో ప్రజా సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయా? ప్రభుత్వం నుంచి సక్రమంగా అందాల్సిన లబ్ధి మీకు చేరలేదా? ఇలా ఏ సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. చిత్రాలను, వివరాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

80089 02897
83282 39927

కొవ్వూరు

●కొవ్వూరు ●నిడదవోలు ●గోపాలపురం

ఘనంగా గరుడ సేవ



దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆశ్వీయుజ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీవారి గరుడ సేవను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. వైభవంగా జరిగిన ఈ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు వేద మంత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

దేవరపల్లి వేంకటేశ్వరస్వామి సన్నిధిలోని సేవలో అర్చకులు

నివాసాల మధ్య మద్యం దుకాణాలు వద్దు



నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని బస్టాండ్ కూడలిలో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణ ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో గురువారం వినతిపత్రాన్ని అందించారు. ఆ సంఘ కన్వీనర్ రాంబాబు మాట్లాడుతూ నిబంధనలు గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. తక్షణమే దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలన్నారు. షేక్ కరిముల్లా, సతీష్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో వినతిపత్రం అందిస్తున్న రాంబాబు

'వైకాపా ప్రభుత్వంలోనే రైతుల ఆత్మహత్యలు'



పరికరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

గోపాలపురం, దేవరపల్లి: గత వైకాపా ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డి రైతు వ్యతిరేక విధానాలు అమలుచేయడం వల్ల ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు విమర్శించారు. బిందు, తుంపర్ల సేద్యానికి సంబంధించి గోపాలపురంలో వ్యవసాయ మార్కెట్‌కు ఐదు లారీలతో వచ్చిన పరికరాలను ఆయన జెండా ఊపి గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి వారిలో నమ్మకాన్ని కలగచేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రైతులకు సేద్యానికి సంబంధించిన పరికరాలను అందజేస్తున్నామన్నారు. వీటిని ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు రొంగళి సత్యనారాయణ, కొర్లపాటి రాము, జ్యేష్ఠ శ్రీధర్, వడ్లమూడి రమేష్, మైక్రో ఇరిగేషన్ పీడీ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకుల్లో సమస్యల తిష్ఠ

నిడదవోలు, న్యూస్‌టుడే: తాగునీటి వనరుల నిర్వహణపై ప్రజా ప్రతినిధులు, పురపాలక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలోని నెహ్రూనగర్ రిజర్వాయర్ ఇందుకు ఉదాహరణ. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరడంతో పాటు, నీరు లీకవ్వడం, ట్యాంకుపై మొక్కలు పెరగడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. కనీస మరమ్మతులకు సైతం నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ట్యాంకు ఏ క్షణాన కూలినా పట్టణ ప్రజలకు తాగునీరు అందదు సరికదా.. ప్రమాదమూ తీవ్ర స్థాయిలో జరిగే అవకాశం ఉంది.



ట్యాంకుపై మొలిచిన మొక్కలు

నిర్మించి 40 ఏళ్లపైనే..

నిడదవోలు పట్టణంలో మొత్తం 28 వార్డులు ఉండగా నెహ్రూనగర్ రిజర్వాయర్ ద్వారా 17 వార్డులకు తాగునీటి సరఫరా అవుతోంది. దీన్ని సుమారు 40 క్రితమే నిర్మించారు. చాలా కాలంగా ఈ రిజర్వాయర్‌కు లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. బాలాజీనగర్‌లో ఉన్న రిజర్వాయర్ ద్వారా 5 వార్డులు, ఎంవీనగర్‌లోని రిజర్వాయర్ ద్వారా 3 వార్డులు, లింగంపల్లి, తీరుగూడెం, బసివిరెడ్డిపేటల్లో ఉన్న రిజర్వాయర్ల ద్వారా ఒక్కొక్క వార్డుకు తాగునీటి సరఫరా జరుగుతోంది. పట్టణ ప్రజలకు నిత్యం ఆరు రిజర్వాయర్ల ద్వారా 5.63 ఎంఎల్‌డీ నీటిని అందిస్తున్నారు. ఈ రిజర్వాయర్‌ల సామర్థ్యం 2.24 ఎంఎల్‌డీ ఉంటుంది. నెహ్రూనగర్ రిజర్వాయర్ లీకులకు మరమ్మతులు చేపట్టాలంటే సుమారు వారం రోజుల పాటు తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. ఆ సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అధికారులు చేపట్టాల్సి ఉంటుంది. నెహ్రూనగర్, లింగంపల్లి ట్యాంకుల మరమ్మతులకు రూ.35 లక్షలతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇంకా అదనంగా రూ.5 లక్షల వరకు అవసరమవుతుందని అంచనా.

లింగంపల్లి రిజర్వాయర్‌దీ ఇదే పరిస్థితి..

లింగంపల్లి రిజర్వాయర్ ద్వారా 23వ వార్డుకు తాగునీరు సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం అది కూడా బీటలు వారి నీరు లీకవుతోంది. గత వైకాపా ప్రభుత్వంలో పురపాలక సంఘ సాధారణ నిధులు రూ.12 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో పనులు ప్రారంభించి వదిలేశారు. ట్యాంక్‌పై మొక్కలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

రూ.35 లక్షలతో ప్రతిపాదనలు..

పట్టణంలో లీకులు ఏర్పడిన నెహ్రూనగర్, లింగంపల్లి ట్యాంకుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు ఏర్పాటు చేసి అప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉంది.

-హేమంత్, ఏఈ, నిడదవోలు పురపాలక సంఘం

పట్టణం	నిడదవోలు
పబ్లిక్ కొళాయిల సంఖ్య	230
ఇంటి కొళాయి కనెక్షన్‌ల సంఖ్య	7,730
మీటరు కనెక్షన్లు	36
మొత్తం రిజర్వాయర్లు	6

ఆదర్శమూర్తి వాల్మీకి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఉండ్రాజవరం, తాళ్లపూడి, న్యూస్‌టుడే: ఆదర్శమూర్తి వాల్మీకి అని గ్రంథాలయ డైరెక్టర్ ఆకెళ్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయం, మండలంలోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ★ తాళ్లపూడి మండలంలోని రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో వాల్మీకి జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు పూలమాలల వేశారు. ఆయన జీవిత చరిత్రను ప్రధానోపాధ్యాయుడు దుర్గారావు విద్యార్థులకు వివరించారు.

సమిశ్రగూడెం ఎస్సైగా వీరబాబు



నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం సమిశ్రగూడెం ఎస్సైగా కె.వీరబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై రమేష్ జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. వీరబాబు సీఐడీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

పల్లెల ప్రగతికి ప్రాధాన్యం: మంత్రి దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలంలో రూ.1,641.86 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మండలంలోని అట్లపాడులో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న మూడు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రూ.439.93 లక్షలతో 6,501 కి.మీ.ల నిడివి గల 85 సీసీ రహదారులు, రూ.107.75 లక్షల వ్యయంతో 50 పశువుల షెడ్లు, రూ.10.21 లక్షలతో 5 పనులు, రూ.114.42 లక్షలతో రహదారి ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే 24 పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కాలువల నీటి సరఫరా ఆధునీకరణకు 94 పనులకు రూ.242.83 కోట్లు, ఫీల్డ్ డిస్ట్రిబ్యూషన్ ఛానల్స్ అభివృద్ధికి రూ.38.18 లక్షలతో 150 పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి దాయం రత్నకుమారి, తెదేపా నాయకుడు మెట్టపల్లి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జనసేన స్తూపాన్ని మంత్రి ఆవిష్కరించారు.



అట్లపాడులో శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి దుర్గేష్

పెరవలి: అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పెరవలి మండలం అజ్జరం, కాకరపర్రు గ్రామాలలోని అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిపెడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచి గుబ్బల ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సత్యవాడ, చిలకపాడు, దమ్మెన్ను, మోర్త, వెలగదుర్రు, కాల్దరి గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, భాజపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నిడదవోలు: ఇటీవల మృతి చెందిన నిడదవోలు పట్టణ తెదేపా సీనియర్ నాయకుడు కేదారిశెట్టి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను మంత్రి కందుల దుర్గేష్ గురువారం పరామర్శించారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి




విద్యార్థులతో భవిత కేంద్రం ఉపాధ్యాయుల ర్యాలీ

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం దుద్దుకూరులో భవిత కేంద్రంలో అభ్యసన వైకల్యం(డిస్లెక్సియా)పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. విద్యాశాఖ అధికారి తిరుమల దాసు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్లోని అభ్యసన వైకల్యాలు గుర్తించి ఉపాధ్యాయులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాల గల పిల్లల కోసం దుద్దుకూరులో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం భవిత కేంద్రంలో జరిగే ఫిజియోథెరపీని వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయురాలు కొత్తపల్లి శ్రీదేవి, విద్యాశాఖ అధికారి-2 అప్పారావు, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాగల్లు, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వ గ్రామోద్యోగ వికాస యోజన(జీవీవై) పథకంలో శిక్షణ ద్వారా నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. దరఖాస్తుదారులు 18 నుంచి 55ఏళ్ల లోపు వారై ఉండాలన్నారు. కుమ్మరి వస్తువులు, తేనెటీగల పెంపకం, చింతపండు ప్రోసెసింగ్, ఎలక్ట్రీషియన్, ఏసీ రిపేరింగ్, కుట్టుమిషన్, పేపర్ ప్లేట్ మేకింగ్, మసాల సుగంధ ద్రవ్యాలు ప్యాకింగ్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దుర్గాదేవి ఊరేగింపు



ఉండ్రాజవరం: దసరా ఉత్సవాల్లో భాగంగా తాడిపర్రులో దుర్గాదేవి ఊరేగింపు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కుంతీ దేవి ఉత్సవాలు

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం యర్నగూడెంలో కుంతీ దేవి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ కుంతీ దేవి అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలతో అన్ని విధాల అభివృద్ధి చెందాలన్నారు. జనసేన మండలాధ్యక్షుడు కాట్నం గణేష్, నరేంద్ర, కరుణాకర్, బల్లా రాము, బద్రి, రమణ, రవీంద్ర పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం ఎలా..?

'హ్యాపీ సండే'తో గతంలో పలు కార్యక్రమాలు

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే

చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, పట్టం కట్టేలా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో కొవ్వూరు పట్టణ పరిధిలో ప్రతి ఆదివారం 'హ్యాపీ సండే' పేరిట కార్యక్రమానికి రూపకల్పన చేశారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని పక్కనున్న రాజమహేంద్రవరంలోనూ అమలుకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇద్దారా వందల మంది చిన్నారులు భరతనాట్యం తదితర శాస్త్రీయ నృత్యాలను వేదికపై ప్రదర్శించి మన్ననలు పొందారు. ఇటువంటి కార్యక్రమాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిలిపివేసింది. కూటమి మరలా అధికారంలోకి రావడంతో పునఃప్రారంభమవుతుందని కళాకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఉత్తమ కళాకారులకు గుర్తింపు..

హ్యాపీ సండే కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్‌తోపాటు అప్పటి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధారాణి జ్ఞాపికలు అందజేసేవారు. దీంతో విద్యార్థుల్లో మరింత ఉత్సుకత పెరిగి విద్యతోపాటు ఇతర రంగాల్లో కూడా ప్రతిభ చూపేందుకు వెసులుబాటు కలిగించేవారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు (పాత చిత్రం)

యోగాపైనా ప్రత్యేక దృష్టి..

యోగా దినోత్సవానికి హడావుడి చేసే అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ తరువాత మరిచిపోవడం పరిపాటైంది. గతంలో ప్రతి పాఠశాలలో యోగా తరగతుల నిర్వహణకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేసేవారు. వారిని ఈ హ్యాపీ సండే కార్యక్రమంలో ప్రదర్శనకు తీసుకు వచ్చి తోటి విద్యార్థుల్లోనూ స్ఫూర్తి నింపేవారు.

ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు..

బుర్రకథ, జానపద నృత్య కళాకారుల జీవితాలకు కార్యక్రమం కొత్త ఆర్థిక వెసులుబాటుకు అవకాశం కల్పించిందని చెప్పవచ్చు. వారంలో ఒక్కసారి పండుగలా, పలు ముఖ్య కార్యక్రమాల్లో కళాకారులు ఈ వేదికపై ప్రదర్శించే వారు. ఇందుకు వారికి నెలకు రూ.5 వేలు ప్రోత్సాహం అందించే వారు. ప్రస్తుతం వీటి ఊసే లేదు.

విద్యార్థులకు గుర్తింపు..

ఆదివారం వస్తే పట్టణంలో ఓ పండుగలా ఉండేది. చిన్నారులు ఆట పాటలతో సందడి చేసేవారు. ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే ఎందరో కళాకారులే కాదు ప్రతిభ ఉన్న విద్యార్థులకు సమాజంలో గుర్తింపు లభిస్తుంది.

– ముత్యాల శ్రీనివాస్, నటరాజ్ డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు, కొవ్వూరు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, న్యూస్‌టుడే: దేవరపల్లిలోని విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో దేవరపల్లి పట్టణం, అచ్యుయ్యపాలెం, బందపురం, 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. యాదవోలు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. ★ గోపాలపురం, జగన్నాథపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వ్యవసాయ విద్యుత్తు సరఫరా ఉదయం 4 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు. ★ నల్లజర్ల విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మత్తుల కారణంగా పరిసర గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదు. వ్యవసాయ విద్యుత్తు ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది.

నిడదవోలు, ఉండ్రాజవరం: నిడదవోలు పట్టణంలోని రెండో ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రధాన రహదారి, గణేష్‌చౌక్, గణపతి కూడలి, యర్నగూడెం రోడ్డు, శాంతినగర్, వైఎస్సార్‌కాలనీ, గాంధీనగర్, రాయిపేట, ఇందిరానగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఈఈ తెలిపారు. ★ కాటకోటేశ్వరం ఫీర పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, పురుషోత్తపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పురుషోత్తపల్లి, మద్దూరు, గోపవరం, విజ్జేశ్వరం, డి.ముప్పవరం, జీడిగుంట, కలవచర్ల, సమిశ్రగూడెం, మునిపల్లి గ్రామాలకు సరఫరా ఉండదు. ★ పాలంగిలో మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదు.

తాళ్లపూడి, చాగల్లు: అన్నదేవరపేట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో అన్నదేవరపేట, సూరయ్యపేటలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఏఈ గారపాటి శ్రీనివాసు తెలిపారు. ★ కొవ్వూరు పట్టణంలోని బాపూజీ నగర్, లాయర్స్ కాలనీ, చిన్న వెంకటేశ్వరస్వామి గుడి రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



అన్నదేవరపేటలో లేఔట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు గృహ నిర్మాణశాఖ ఈఈ చంద్రశేఖర్ తెలిపారు. తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేటలో లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాల పరిస్థితిని ఆ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఇక్కడ 857 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, వీటిలో 92 గృహాలు మాత్రమే పూర్తయ్యాయన్నారు. 17 శ్లాబ్, 38 గోడలు, 136 పునాదులు, మిగతావి ఇంకా మొదలు పెట్టలేదని గుర్తించామన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంలో వీటిని పూర్తి చేసేలా చర్యలు చేపడతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ ఎం.శ్రీనివాసరావు, ఏఈ జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొవ్వూరు మండలంలో గ్రామ సభలు

చాగల్లు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నుంచి నవంబరు 15వ తేదీ వరకూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు కొవ్వూరు తహసీల్దార్ దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం చిడిపిలో ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 19న ఆరికిరేవుల, 21న పెనకనమెట్ట, 22న పశివేదల, 23న తోగుమ్మి, 24న చిగురులంక, 25, 26 తేదీల్లో కుమారదేవం, 28న మద్దూరులంక, 29, 30 తేదీల్లో ధర్మవరం, నవంబరు 4, 5 తేదీల్లో ఐ.పంగిడి, 6, 7 తేదీల్లో దేచర్ల, 11, 12 తేదీల్లో వేములూరు, 13, 14 తేదీల్లో వాడపల్లి, 15, 16 తేదీల్లో మద్దూరులో గ్రామ సభలు ఉంటాయన్నారు.

'కూటమి అభ్యర్థిని గెలిపించుకుందాం'

చాగల్లు, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిని గెలుపించుకుందామని తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి పెనుమాక జయరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. కూటమి గెలుపుతో కేంద్ర ఆర్థిక సాయం అంది పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందన్నారు.

తాగునీటి లీకులతో ఇబ్బందులు



మండలంలోని వేగేశ్వరపురం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో తాగునీటి కొళాయికి బిరడా లేక నీరంతా వృథాగా పోతోంది. బిరడా పగిలిపోవడంతో తాగునీరంతా పక్కనే ఉన్న డ్రెయిన్‌లోకి పోతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. గతంలో మరో పైపులైను లీకయితే దానిని తామే సరిచేశామంటున్నారు. దీనిపై ఎంపీడీవో రమణను వివరణ కోరగా సంబంధిత కార్యదర్శితో మాట్లాడి నీరు వృథాను అరికట్టడానికి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, తాళ్లపూడి

ఈ దారిలో 'నడక'యాతన



దమ్మెన్ను నుంచి వేలివెన్ను వెళ్లే రహదారి పూర్తి స్థాయిలో దెబ్బతింది. ఈ రహదారిపై ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నామని చోదకులు వాపోతున్నారు. అడుగుకో గుంత దర్శనమిచ్చే ఈ దారులపై వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేదని అంటున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారికి మరమ్మతు పనులు చేయించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రహదారిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసు తెలిపారు. – న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

గుంత పూడ్చారు

నిడదవోలు: డి.ముప్పవరం నుంచి గోపవరం వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో పురుషోత్తపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదురుగా ఏర్పడిన గుంతను అధికారులు పూడ్చారు. 'ఈనాడు'లో 'సంచి సరిపోతుందా..!' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పనులు చేపట్టారు.

దుర్వాసనతో ఇబ్బంది

సమస్య: తెలికిచెర్ల శివారులో రహదారి పక్కన వేస్తున్న వ్యర్థాల వల్ల ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. సమస్యను పరిష్కరించాలి. – రాము, స్థానికుడు

సమాధానం: సమస్యను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తాం.

– బండి చిట్టియ్య, సర్పంచి, తెలికిచెర్ల

– న్యూస్‌టుడే, నల్లజర్ల

సమస్య: కుకునూరు గీతామందిరం సమీపంలో డ్రెయిన్ వ్యర్థాలతో నిండిపోయాయి. పిచ్చి మొక్కలు కూడా మొలిచాయి. మురుగు పారుదలకు ఆటంకాలు ఎదురవడంతో దుర్వాసన వెల్లువెత్తుతోంది. రాత్రి వేళల్లో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికుడు, కుకునూరు

సమాధానం: డ్రెయిన్‌ను పరిశీలించి శుభ్రం చేయిస్తాం.

– వీరన్న, పంచాయతీ కార్యదర్శి, తాళ్లపూడి

– న్యూస్‌టుడే, తాళ్లపూడి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

ప్రమాదకరంగా పాత వంతెనలు

చాగల్లు, న్యూస్‌టుడే

సేవలందిస్తున్న పురాతన వంతెనలు శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రెయిలింగ్‌లు సైతం కూలిపోతున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. కాపవరం నుంచి కొవ్వూరు మధ్యలో ఐదు కల్వర్టులు ఉన్నాయి. ఇవి అక్కడక్కడ విరిగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. చాగల్లు మండలంలో చంద్రవరం, దారవరం, నందమూరు గ్రామ శివారులో చిన్న వంతెనలు ప్రమాదాలకు ఆలవాలంగా మారాయి. పెరవలి లాకుల వద్ద రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదవశాత్తు జారిపడి అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జూన్ 22న గల్లంతయ్యారు. గాలింపు చర్యల్లో విగత జీవులుగా తేలారు. జూలై 17న ఎస్.కొండేపాడుకు చెందిన జి.శేషారావు సైకిల్ వెళ్తూ రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదవశాత్తూ యనమదుర్రు కాల్వలో పడి గల్లంతయ్యారు. ఇటువంటి సంఘటనలు అనేకం జరుగుతున్నా వంతెనల రెయిలింగ్‌లను బాగుచేయించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు..

వంతెనల ప్రారంభం, ముగింపు ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్థులు పలుసార్లు అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. కాపవరం వంతెన మీదుగా వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వాహనాలు అధిక సామర్థ్యంతో వెళ్తున్నారు. రాళ్లమడుగుపై ఉన్న ఈ వంతెన సామర్థ్యం 30 టన్నులు కాగా అంతకమించిన బరువుతో వాహనాలు తిరుగుతున్నాయి.



కాపవరంలో రాళ్లమడుగు వంతెన ఇలా..



రెయిలింగ్ విరిగిన చంద్రవరం పేముల కాలువ వంతెన

ఉన్నతాధికారులకు నివేదించాం..

ఈ వంతెల రెయిలింగ్‌లకు ర.భ.శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– సుజాత, పంచాయతీ కార్యదర్శి, చంద్రవరం

విగ్రహాల విషయంలో వివాదాలు తగదు



తాడిపర్రులో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీవో వాణిసుష్మిత

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటు విషయంలో వివాదాలు తగవని కొవ్వూరు ఆర్డీవో వాణిసుష్మిత అన్నారు. తాడిపర్రులో పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేసిన విషయంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంపై ఆమె గురువారం గ్రామానికి వచ్చి ఇరు వర్గాలతో చర్చించారు. డీఎస్పీ దేవకుమార్, తహసీల్దార్ పి.ప్రసాదు, ఎంపీడీవో వి.రామారావు, పలువురు పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితులపై ఆరా

చాగల్లు: చాగల్లులోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి కె.విజయ్‌కుమారి గురువారం పరిశీలించారు. కేంద్రాల్లోని వసతులు, భోజనం, ఇతర ఆహార పదార్థాల పంపిణీ తదితర అంశాలను ఆయా కేంద్రాల సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

కూటమి అభ్యర్థులకు ఏపీజీసీఈఎఫ్ మద్దతు

రాజానగరం: కూటమి తరపున పోటీ చేసే ఉపాధ్యాయ, పట్టభద్రులు శాసనమండలి అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ ఉద్యోగుల ఫెడరేషన్ (ఏపీజీసీఈఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఛైర్మన్ రౌతు గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 2025 మార్చి నెలలో నిర్వహించనున్న గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, ఉభయగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మొత్తం నాలుగు శాసన మండలి పదవులకు నిర్వహించే ఎన్నికలలో కూటమి మద్దతు ప్రకటించిన అభ్యర్థులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన వివరించారు. అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలని కన్వీనర్ డా. వి.కనకరాజు కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ నెంబరు 114, వివిధ ప్రభుత్వ శాఖలలో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం చేసిన చట్టం తక్షణమే అమలు పరిచాలని కోరారు. పి.కృష్ణంనాయుడు, ఎం. వీరాంజనేయులు, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు: దానవాయిపేట: శ్యామల: వేట్టయన్, ఊర్వశి: సత్యం సుందరం, సూర్యప్యాలస్: ఇద్దరు, రాజా: మార్టిన్, కుమారి, అప్సర: దేవర, అశోక: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, రంభ: రాధే కృష్ణ, మానాన్న సూపర్ హీరో (రెండేసి ఆటలు), మేనక: కల్లు కాంపౌండ్,మార్టిన్ (రెండేసి ఆటలు), శివజ్యోతి, లవ్ రెడ్డి, ది డీల్(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, విశ్వం(రెండేసి ఆటలు).

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)

దేవీచౌక్: టమాట-38, వంకాయలు(నలుపు-30/గులాబీ-40/తెలుపు-34/దొమ్మేరు-42), బెండ-25, కాకర-30, బీర(పందిరి)-32, దొండ-24, క్యారెట్-40, బీట్‌రూట్-36, గోరుచిక్కుళ్లు-30, దోస-34, ఆనబకాయ-35, చిక్కుళ్లు-72/దేశవాళీ-88, పచ్చిమిర్చి-40, బంగాళదుంపలు-34, ఉల్లిపాయలు-50/కొత్తవి-32.

14 కోర్సులు.. 294 సీట్లు

ఆర్ట్స్ కళాశాలలో పీజీ ప్రవేశాలు

న్యూస్‌టుడే, దేవీచౌక్

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి తక్షణ ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఏపీ పీజీసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశాలకు అర్హులు. మొత్తం 14 పీజీ కోర్సులకు సంబంధించి 294 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

విద్యార్థికి వచ్చిన ర్యాంకు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను భర్తీ చేయనున్నారు. మొదట వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. కళాశాల గ్రంథాలయం రిఫరెన్స్ సెక్షన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశాలు నిర్వహిస్తారు. ఏపీ పీజీసెట్-2024లో అర్హత సాధించి ర్యాంకు వచ్చిన విద్యార్థులు తమకు నచ్చిన కళాశాల, కోర్సుల్లో సీట్లు రానివారు స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చని కళాశాల ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు వెల్లడించారు. రెగ్యులర్ కోటాలో ఫీజు తక్కువగా ఉంటుందని తెలిపారు.

మొత్తం సీట్లలో..
రెగ్యులర్ కోటా : 114
సెల్ఫ్ ఫైనాన్స్ : 180

ఈ ధ్రువపత్రాలు తప్పనిసరి
✦ విద్యార్హత పత్రాలు(పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ మార్కుల జాబితా, ప్రొవిజినల్ సర్టిఫికెట్) ✦ ఏపీ పీజీసెట్-2024 ర్యాంకు కార్డు ✦ స్టడీ సర్టిఫికెట్ ✦ నివాస ధ్రువీకరణ పత్రం(అవసరమైనవారు) ✦ కుల ధ్రువీకరణ పత్రం(అవసరమైనవారు) ✦ ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం(అవసరమైనవారు) ✦ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ ✦ వీటితోపాటు ఒక సెట్ నకలు కాపీలు తీసుకు రావాలి.


ఆర్ట్స్ కళాశాలలోని పీజీ బ్లాక్

కోర్సుల్లో సీట్ల ఖాళీల వివరాలు

ఎంఏ	
తెలుగు	– 52
ఎకనామిక్స్	– 30
పొలిటికల్ సైన్స్	– 25
ఎంకాం	– 40
ఎమ్మెస్సీ	
మ్యాథమ్యాటిక్స్	– 34
ఫిజిక్స్	– 24
ఆర్గానిక్ కెమిస్ట్రీ	– 2
ఫిజికల్ కెమిస్ట్రీ	– 5
బోటనీ	– 19
జువాలజీ	– 8
కంప్యూటర్ సైన్స్	– 9
ఆక్వాకల్చర్	– 13
జియాలజీ	– 33

నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తపడాలి

కడియం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య విస్తరణాధికారి ఎం.వి.బి.రామకృష్ణ సూచించారు. గురువారం గంబూషియా చేపలను విడుదల చేశారు. చెల్లుబోయిన శ్రీను, గుత్తుల కృష్ణ, వాసంశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


వేమగిరిలో గంబూషియా చేపలను వదులుతున్న ప్రజాప్రతినిధులు

మేమున్నాం.. మీకు తోడుగా

రహదారిపై చెత్త తొలగించాలి



సమస్య: స్థానిక బోటాఫీసు వీధిలో రహదారిపై వ్యర్థాలు, చెత్త తొలగించకపోవడంతో పశువులు, పందులు రహదారిపైకి లాగేస్తున్నాయి. దాంతో అటుగా వెళ్లాలంటే దుర్వాసన భరించలేకపోతున్నాం. ఆప్రాంతంలో చెత్త కుండీ పగిలిపోయినా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడంలేదు. – సీహెచ్ మురళి, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి చెత్త, వ్యర్థాలను తొలగిస్తాం. చెత్తకుండీ కొత్తది ఏర్పాటు చేస్తాం. – వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి, ధవళేశ్వరం

– న్యూస్‌టుడే, ధవళేశ్వరం

వ్యర్థాలు తరలించారు..

స్పందనకు వందనం

సీతానగరం మండలం ముగ్గళ్ల సచివాలయం వద్ద పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. చెత్త వేస్తే జరిమానా అనే హెచ్చరిక బోర్డు వద్దనే పేరుకుపోయిన చెత్తపోగులపై 'హెచ్చరిక వద్దనే పోగులు' అనే శీర్షికన 16వ తేదీన 'ఈనాడు'లో వచ్చిన వార్తపై పంచాయతీ అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడంతో స్థానికులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

– న్యూస్‌టుడే, సీతానగరం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: రీసర్వేలో తప్పుల్ని సరిదిద్దటానికి ఈనెల 18వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు రమణి తెలిపారు. 18న తేదీన రాళ్లఖండ్రిక, 19న తొస్సిపూడి, 21న తుమ్మలపల్లి, 22న ఇల్లపల్లి, 23న ఆరికిరేవుల, 24న మెళ్లూరు, 25న కొమరిపాలెం, 28న రంగాపురం, నవంబరు 4న పందలపాక, 6న కొంకుదురు, 11న ఊలపల్లి, 13న కాపవరం, 15న బలభద్రపురం, 18న బిక్కవోలులో నిర్వహించనున్నట్లు వివరించారు. ● అనపర్తి మండలంలో: అలాగే, అనపర్తి మండల పరిధిలో పెడపర్తిలో 18న, కుతుకులూరులో 19న, కొప్పవరంలో 21న, పొలమూరులో 22న, రామవరంలో 23న, మహేంద్రవాడలో 24న, దుప్పలపూడిలో 25న, పులగుర్తలో 28న, అనపర్తిలో నవంబరు 4న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. **రంగంపేట:** రీసర్వేలో తలెత్తిన భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఈ నెల 18వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఉండవిల్లి రంజిత్‌కుమార్ తెలిపారు. 18న ఎస్.టి.రాజాపురం, 19న సుభద్రంపేట, 21న వెంకటాపురం, 22న నల్లమిల్లి, 23న వీరంపాలెం, 25న సింగంపల్లి, 28న పెదరాయవరం, నవంబరు 4న ముకుందవరం, 6న మర్రిపూడి, 11న కోటపాడు, 13న దొడ్డిగుంట, 15న ఈలకొలనులో ఈ సభలు జరుగుతాయని ఆయన వివరించారు.

నిధులు రాలేదు.. టెండర్లూ పిలవలేదు

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాధేయపాలెం (రాజానగరం), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితమయ్యాయని, కనీసం టెండర్లు సైతం పిలవలేకపోయారని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని రాధేయపాలెంలో పల్లెపండగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. అనంతరం మాట్లాడారు. పలుమార్లు శంకుస్థాపనలు చేసి గుత్తేదారులు ఎవరూ రాక పనులు సైతం ప్రారంభించలేకపోయారని విమర్శించారు. గత జగన్ సర్కారు ప్రజలకు ఉపయోగపడని పనులు చేసేందుకు ప్రయత్నించారే తప్ప.. మేలు చేయలేకపోయారన్నారు. తొర్రిగడ్డ పంపింగ్ స్కీం కాగితాలకే పరిమితమైందని, టెండర్లు కాకపోగా.. మూడుసార్లు శంకుస్థాపన చేసినా పని ప్రారంభించలేకపోయారన్నారు. జలజీవన్‌మిషన్ పథకం అమలుపై కోరుకొండలో తామే ధర్నా చేస్తే 34 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి గాలిగోపురం పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యారని, టెండర్లు సైతం పిలవలేకపోయారన్నారు. రంగనాథస్వామి ఆలయం విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. పారిశ్రామికవాడ ఏర్పాటుపైనా మాజీ ఎమ్మెల్యే గొప్పలు చెప్పారన్నారు. గత ప్రభుత్వం పారిశ్రామికవాడ అంటూ శంకుస్థాపన చేస్తే, మర్నాడే శిలాఫలకం మాయమైందని ఎద్దేవా చేశారు. ఆనాడు పనులు ప్రారంభించి ఉంటే అప్పటి జీఓను రద్దు చేయడానికి అవకాశం ఉండేది కాదని, పనులు ప్రారంభించకపోవడంతో జీఓను రద్దు చేశారన్నారు. మళ్లీ రూ. 370 కోట్లతో అంచనాలు రూపొందించారని, ఆ మేరకు ఆదేశాలు రాబోతున్నాయన్నారు. తద్వారా ఆ పథకాన్ని అమలు చేసి ప్రజలందరికీ మంచినీటిని అందిస్తామన్నారు. రాధేయపాలెం, పాతతుంగపాడు, కొత్తతుంగపాడు, జి.యర్రంపాలెం, సంపత్‌నగరం, కొండగుంటూరు గ్రామాల్లో గురువారం శంకుస్థాపనలు చేశారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొడ్డు వెంకటరమణ చౌదరి, నీరుకొండ వీరన్నచౌదరి, దొరబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


రాధేయపాలెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సంపత్‌నగరం (రాజానగరం): మండలంలోని సంపత్‌నగరం ఉపకేంద్రం పరిధిలో ఈ నెల 18వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంపత్‌నగరం, కొండగుంటూరు, నామవరం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, కె.తుంగపాడు, పి.తుంగపాడు, జి.యర్రంపాలెం గ్రామాల్లో సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వివరించారు.

గోకవరం: ఠంటికొండ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో చేపట్టిన మరమ్మతుల కారణంగా పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరా ఉండదని సంబంధిత అధికారులు తెలిపారు. గోకవరం మండలంలో ఠంటికొండ, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, గోపాలపురం గ్రామాలు, కోరుకొండ మండలంలోని గరగలంపాలెం, అచ్చియ్యపాలెం గ్రామాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట, రమణయ్యపేట, శరభవరం, ఉప్పుదాలపాలెం, కమలంపాలెం, పోతుకొండ, దేవారం, పోతవరం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

అనపర్తి గ్రామీణం: అనపర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుప్పలపూడి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో అనపర్తిలోని జీబీఆర్ కళాశాల ప్రాంతం, ఇందిరానగర్, సునందనగర్, మార్కెండేయపేట, శేషగిరిరావుపేట, వెంకటరత్నాపురం, మెయిన్‌రోడ్డు, కొప్పవరం, దుప్పలపూడి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

దేవీచౌక్: అత్యవసర మరమ్మతుల నిమిత్తం శుక్రవారం రాజమహేంద్రవరం గ్రామీణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బాలాజీపేట, సావిత్రినగర్, ఆదర్శనగర్, రామకృష్ణనగర్.. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హౌసింగ్ బోర్డు కాలని, స్పిన్నింగ్ మిల్లు ప్రాంతం, ఆటోనగర్, స్వరూప్‌నగర్.. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొంతమూరు గ్రామంలోని కంటిపూడి లేఔట్, క్రషర్స్ ప్రాంతంలో సరఫరా ఉండదని చెప్పారు.

ధవళేశ్వరం: శంభూనగర్ 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ధవళేశ్వరంలోని షిరిడీ సాయినగర్, లక్ష్మీనరసింహ నగర్, శ్రీపాదవారి వీధి, వడ్డెర కాలనీ, అఫీషియల్ కాలనీ, శాంతారామ్ ఆసుపత్రి, కంచరలైన్, కొత్తపేట, మెయిన్‌రోడ్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు.

పట్టుదలకు నిలువెత్తు రూపం వాల్మీకి


బొమ్మూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

కడియం, న్యూస్‌టుడే: కృషి, పట్టుదలకు నిలువెత్తు నిదర్శనంగా వాల్మీకి మహర్షి నిలిచారని తెలుగునాడు ఉపాధ్యాయసంఘం రాష్ట్ర కార్యదర్శి జయరాజు సూచించారు. వేమగిరిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉదయం వాల్మీకి జయంతి వేడుకను చిన్నారుల మధ్య నిర్వహించారు. ఆ సందర్భంగా వాల్మీకి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు యాతం నాగమణి, సతీశ్‌బాబు, పావని తదితరులు పాల్గొన్నారు.

బొమ్మూరు: బొమ్మూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో వాల్మీకి జయంతి గురువారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల ప్రత్యేకాధికారిణి జ్యోతి, హెచ్‌ఎం ప్రియదర్శిని ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కడియం మండలం వేమగిరిలో..

రంగంపేట విద్యార్థినులకు పోటీలు

రంగంపేట: రంగంపేటలోని శ్రీఉండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమంలో భాగంగా 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు ఐసీడీఎస్ ఆధ్వర్యాన ఈ పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరచిన వారిని హెచ్‌ఎం పార్థసారథి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గుల్జార్ బేగం, రమణాంజలి అభినందించారు.


వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్న రంగంపేట విద్యార్థిని

పౌర్ణమికి ప్రత్యేక పూజలు

రంగంపేట, న్యూస్‌టుడే: పౌర్ణమి సందర్భంగా గురువారం రంగంపేట మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రంగంపేటలోని ప్రాచీన శివాలయంలో మహిళలతో అర్చకులు మైలవరపు నాగేంద్రకుమార్ హోమ పూజలు చేయించారు. వడిశలేరు, సింగంపల్లి, పెదరాయవరం, చంద్రేడు, ఈలకొలను, జి.దొంతమూరు, ముకుందవరం, సుభద్రంపేట ఆలయాల్లోనూ భక్తులు పూజలు నిర్వహించారు.


రంగంపేట శివాలయంలో హోమ పూజలు

19న ప్రభుత్వ పింఛనర్లకు ఉచిత వైద్య శిబిరం

అనపర్తి గ్రామీణం: అనపర్తిలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం భవనం వద్ద ఈ నెల 19న ప్రభుత్వ పింఛనర్లకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారీ సమావేశం అనంతరం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో కంటి, దంత, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పల్లె పండగ వాయిదా

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు, రాజవోలులో శుక్రవారం నిర్వహించాల్సిన పల్లెపండగ కార్యక్రమం వాయిదా పడిందని బొమ్మూరు గ్రామ కార్యదర్శి కాశీ గురువారం తెలిపారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అత్యవసర కారణాల వల్ల అందుబాటులో లేరని తెలిపారు. కార్యక్రమం ఎప్పుడు జరిగేది త్వరలో తెలియజేస్తామన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ

బిక్కవోలు: కొంకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలకు.. ఇదే పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులు కంభంపాటి అప్పారావు విద్యుత్ ఇన్వర్టర్, 12 తాళం కప్పలు బహూకరించారు. ఆయన భార్య, ఉపాధ్యాయిని అన్నపూర్ణ ఇటీవల మృతి చెందారు. ఆమె జ్ఞాపకార్థం వీటిని అందించినట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు.

ఆటో ఢీకొని గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: కొంతమూరు ప్రాంతానికి చెందిన ఎం.చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై గురువారం ఉదయం రాజా థియేటర్ రోడ్డులో వెళ్తుండగా ఆటో ఢీ కొంది. ఆ ప్రమాదంలో అతడికి గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాయి.

నందరాడలో చోరీ

రాజానగరం: కుటుంబంతో సహా ఊరెళ్లి మూడురోజుల తరువాత ఇంటికి వచ్చి చూడగా.. బంగారు ఆభరణాలు అదృశ్యమైన ఘటన నందరాడలో జరిగింది. సీఐ ఎస్.పి.వీరయ్యగౌడ్ సమాచారం మేరకు.. నందరాడ గ్రామానికి చెందిన అడబాల సూర్యప్రకాశరావు ఈ నెల 14వ తేదీన కుటుంబంతో సహా ఊరు వెళ్లారు. 17వ తేదీ ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు బద్దలుకొట్టి కనిపించాయి. లోనికి వెళ్లి చూడగా.. బీరువాలో ఉండాల్సిన సుమారు 10 కాసుల బంగారు వస్తువులు, నగదు పోయినట్లు గుర్తించారు. ఆ ఇంటి వెనుక ఉండే అతని సోదరుడి ఇంట్లోనూ అపహరణ జరిగినట్లు నిర్ధారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి ఎస్సై మనోహర్ దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెలు అపహరించిన వ్యక్తుల అరెస్టు

గోకవరం: గొర్రెలను అపహరించిన వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన తర్రా నాగేశ్వరావు గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. గతనెల 9వ తేదీన గొర్రెలను తీసుకొని గోకవరం సంతకు రాగా అందులో మూడు గొర్రెలు అపహరణకు గురయ్యాయి. దీంతో నాగేశ్వరావు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. స్థానిక బండి పోసియ్య, పసుపులేటి దేవదాసులు గొర్రెలను దొంగిలించినట్లు గుర్తించి గురువారం వారిని అరెస్ట్ చేసి అపహరణకు గురైన గొర్రెలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

పంట కాలువ ముంపు

● బాలుడికి త్రుటిలో తప్పిన ప్రమాదం

సీతానగరం, న్యూస్‌టుడే: తొర్రిగడ్డ పంటకాలువ పొంగడంతో పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే వారి ఇళ్లన్నీ గురువారం ముంపులోకి చేరాయి. సీతానగరంలో పంటకాలువ పక్కనే సుమారుగా 150 కుటుంబాలు పాకలు వేసుకుని నివాసం ఉంటున్నారు. పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం నుంచి పంటకాలువలకు సాగునీరు విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో పంటకాలువల ఆధునికీకరణ పనులు చేయకపోవడంతో గట్లకు పటిష్టత లేకుండా పోయింది. కాలువల్లో ప్రవహించే నీరు ఒక్కసారిగా పెరగడంతో పలు ఇళ్లు ముంపులోకి చేరి స్థానికులు అవస్థలు పడ్డారు. నివాసాల్లో ఉండేవారంతా బయటకు రావాలంటే పంటకాలువపై వేసిన సిమెంటు స్తంభాలపై నడుస్తూ ప్రమాదకర పరిస్థితుల్లో ఉంటున్నారు. గురువారం బర్రే వెంకట సత్యనారాయణ అనే తొమ్మిదేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి కొట్టుకుపోతుండగా స్థానికులు రక్షించారు. తాగునీరు కొళాయిలు కూడా ముంపులోకి చేరాయని అక్కడే నీరు పట్టుకుంటున్నామని మహిళలు వాపోతున్నారు.


సీతానగరంలో పంటకాలువ గట్లు తెగి ముంపులోనే తాగునీరు తెచ్చుకుంటున్న మహిళలు

పట్టాలిచ్చి వదిలేశారు



నాలుగేళ్ల క్రితం 6కిలోమీటర్ల దూరంలో ఉన్న సుద్దకొండ వద్దకు తీసుకెళ్లి ఇళ్ల నిర్మాణం చేస్తున్నామంటూ వైకాపా నాయకులు చేతిలో పట్టా పెట్టారంతే. ఆ తర్వాత పార్టీ సమావేశాలు ఎక్కడ జరిగినా కాలువగట్టు పక్కనే ఉంటున్న 150 కుటుంబాలను తీసుకెళ్లేవారు. చివరికి ఇటీవల జరిగిన ఎన్నికల ముందు అలాగే చేశారు కానీ మా సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుతం కాలువ గట్టు పక్కనే ముంపులో చాలా ఇబ్బందిపడుతూ జీవనం సాగిస్తున్నాం.


– పాతపాటి జ్యోతి

ఒక పంపునకు పరిమితం చేస్తాం

తొర్రిగడ్డ ఎత్తిపోతల నుంచి రెండు పంపుల ద్వారా 240 క్యూసెక్కుల నీరు దిగువ ఆయకట్టుకు విడుదల చేస్తున్నాం. సీతానగరంలో గట్టు పక్కనే నివాసాలు ముంపులోకి చేరడం.. అక్కడ ప్రమాదకర పరిస్థితులపై ప్రస్తుతం ఒక పంపునకు నీటిని తగ్గిస్తాం. శాశ్వత పరిష్కారానికి కాలువ గట్టు ఆధునికీకరణ పనులు చేయాల్సి ఉంది.

– శివరామకృష్ణ, ఏఈ, జలవనరులశాఖ

అమృతమూర్తికి అశ్రునివాళి



మా హృదయ ఫలకాలపై చెక్కిన సజీవ శిల్పం మీ రూపం. అనురాగానికి, ఆప్యాయతలకు చిరునామా మీ హృదయం. మీరు వేసిన ప్రతీ అడుగు మాకు ఆదర్శం. నడిచిన ప్రతీదారి సదాశయం. చేరిన ప్రతి గమ్యం స్ఫూర్తి శిఖరం.. మీరే మాకు మార్గదర్శి.. ప్రేమానురాగాలుతో పెంచి మా బంగారు భవిష్యత్తుకు బాటలు పరిచి మా అందరికీ వెలుగునిచ్చి.. జీవనజ్యోతిగా ఆఖరి వరకు దారి చూపావు. అలసి సొలసి పోయి.. విశ్రమించిన మీ పాదాలకు మా హృదయనివాళులు అర్పిస్తూ, మీ జ్ఞాపకాలతో ముందుకు సాగుతూ, మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. బాధాతప్త హృదయాలతో నివాళులు అర్పిస్తూ...

భార్య: శ్రీమతి ద్వారంపూడి లక్ష్మీదేవి (లేటు)

కుమారుడు : ద్వారంపూడి నారాయణరెడ్డి - శ్రీమతి మాణిక్యం
మనుమడు : ద్వారంపూడి దేవేంద్రరెడ్డి - శ్రీమతి హేమలత
మునిమనుమరాండ్రు : జేశ్వితరెడ్డి, వసుదారెడ్డి
మనుమరాలు : శ్రీమతి కర్రి హరిణి - సుగుణ్‌కుమార్‌రెడ్డి
మునిమనుమడు : చి॥ విషాన్‌రెడ్డి
మనుమరాలు : శ్రీమతి తేతలి వినూష - రాధాకృష్ణారెడ్డి
మునిమనుమరాలు : చి॥ వైష్ణవి రెడ్డి

పెద్దకుమార్తె: శ్రీమతి సత్తి పద్మావతి - సూర్యనారాయణరెడ్డి (లేటు)
మనుమరాలు: కర్రి రాణి
మునిమనుమరాలు: చి॥ రూప నాగసాత్వికా రెడ్డి
మనుమరాలు: శ్రీమతి నల్లమిల్లి విజయ - సూర్యనారాయణరెడ్డి (చిన్న)
మునిమనుమడు: చి॥ శశిధర్ రెడ్డి
మనుమడు: సత్తి వీరవెంకట సత్యనారాయణరెడ్డి - శ్రీమతి సుమ
మునిమనుమలు: చి॥ సుప్రజారెడ్డి, చి॥ విష్ణిమారెడ్డి, చి॥ శివబాలసూర్యనాథ్‌రెడ్డి

చిన్నకుమార్తె: శ్రీమతి సత్తి లక్ష్మి (భూలక్ష్మి) - సూర్యనారాయణరెడ్డి
మనుమరాలు: సత్తి జయలక్ష్మి (లేటు)
చింతా విజయమాధవి- వీరవెంకట సూర్య రామకృష్ణారెడ్డి
మునిమనుమరాలు: చి॥ వీరవెంకట అరుణ కావ్య శశి గాయత్రి
మనుమడు: సత్తి అశోక్‌కుమార్‌రెడ్డి

కీ॥శే॥ ద్వారంపూడి అమ్మిరెడ్డి గారు

మరణం: 08-10-2024

పాలమూరు, అనపర్తి మండలం

పెద్దకార్యం: ది.18-10-2024 (ఈరోజు) శుక్రవారం పాలమూరు గ్రామంలో మా గెస్ట్‌హౌస్‌నందు జరుగును.

వియ్యంకుడు - వియ్యపురాలు	వియ్యంకుడు - వియ్యపురాలు	వియ్యంకుడు - వియ్యపురాలు
సత్తి సత్తిరెడ్డి - శ్రీమతి ఆదిలక్ష్మి	సత్తి వీర్రెడ్డి (లేటు) - శ్రీమతి లక్ష్మీకాంతం (లేటు), కుతుకులూరు	సత్తి సత్యనారాయణరెడ్డి (లేటు) - శ్రీమతి అలివేలు మంగాయ్యమ్మ (లేటు), అనపర్తి

మాకు అత్యంత ఆత్మీయులు, మా శ్రేయస్సు కోరుకొనే మంచిమనిషి, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ ద్వారంపూడి నారాయణరెడ్డి గారి తండ్రి గారైన శ్రీ **ద్వారంపూడి అమ్మిరెడ్డి** గారి మరణానికి చింతిస్తూ... వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెల్పుతూ...

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, శాసనసభ్యులు, అనపర్తి శ్రీమతి మహాలక్ష్మి	శ్రీమతి సత్తి గీతావరలక్ష్మి, వెంకటరెడ్డి, పాలమూరు ZPTC, అనపర్తి మండలం	సత్తి సూరారెడ్డి, శ్రీమతి విజయమణి ఉపసర్పంచ్, పాలమూరు	కర్రి వెంకటరెడ్డి శ్రీమతి నాగమణి, కుతుకులూరు

కర్రి వెంకట కృష్ణారెడ్డి శ్రీమతి అనంతలక్ష్మి, తూరంగి	తేతలి వెంకన్నబాబు శ్రీమతి పార్వతి, మహేంద్రవాడ	గాలుగూరి వెంకటరెడ్డి శ్రీమతి మాధవీలత కుతుకులూరు	నల్లమిల్లి గంగిరెడ్డి శ్రీమతి చంద్రావతి గొల్లలమామిడాడ	చింతా అనంత కృష్ణారెడ్డి (దొరబాబు) శ్రీమతి విజయలక్ష్మి గొల్లలమామిడాడ	ద్వారంపూడి మంగిరెడ్డి (లేటు) శ్రీమతి సూర్యకాంతం	ద్వారంపూడి వెంకటరామారెడ్డి శ్రీమతి మాణిక్యం
ద్వారంపూడి నాగిరెడ్డి శ్రీమతి చెల్లాయమ్మ	ద్వారంపూడి సూర్యచంద్రారెడ్డి శ్రీమతి మంగాయ్యమ్మ	ద్వారంపూడి సుబ్బారెడ్డి (లేటు) శ్రీమతి లక్ష్మీతులసి	ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి (లేటు) శ్రీమతి పాపాయ్యమ్మ (లేటు)	ద్వారంపూడి రామకృష్ణారెడ్డి శ్రీమతి అచ్చియ్యమ్మ	శ్రీమతి సత్తి భాగ్యలక్ష్మి వీర్రాఘవరెడ్డి	ద్వారంపూడి మంగిరెడ్డి శ్రీమతి భాగ్యలక్ష్మి
ద్వారంపూడి ఆదిరెడ్డి (లేటు) శ్రీమతి అమ్మాయి	శ్రీమతి పడాల లక్ష్మి వీర్రాఘవరెడ్డి	శ్రీమతి తేతలి పద్మావతి వెంకటరెడ్డి, అనపర్తి	ద్వారంపూడి వెంకట గోపాలరెడ్డి శ్రీమతి పద్మావతి	ద్వారంపూడి నాగిరెడ్డి శ్రీమతి సులోచన	శ్రీమతి సత్తి వెంకటలక్ష్మి వెంకటరెడ్డి	ద్వారంపూడి సత్తిరెడ్డి శ్రీమతి శేషారత్నం
శ్రీమతి సత్తి సీతామహాలక్ష్మి రామకృష్ణారెడ్డి, రాజమండ్రి	శ్రీమతి సత్తి పద్మావతి ప్రభాకరరెడ్డి	శ్రీమతి సత్తి సత్తెమ్మ (లేటు) సూరన్న (లేటు)	సత్తి కొండారెడ్డి (లేటు) శ్రీమతి సీతాయ్యమ్మ	శ్రీమతి గాలుగూరి ఆదిలక్ష్మి సత్తిరెడ్డి, పందలపాక	సత్తి అమ్మిరెడ్డి శ్రీమతి మంగాయ్యమ్మ	సత్తి సుబ్బారెడ్డి (లేటు) శ్రీమతి వరలక్ష్మి
సత్తి నాగిరెడ్డి శ్రీమతి ఉమారత్నం	సత్తి అమ్మిరెడ్డి శ్రీమతి భూలక్ష్మి, సోమేశ్వరం	శ్రీమతి నల్లమిల్లి కరుణకుమారి భీమారెడ్డి, మండపేట	సత్తి లక్ష్మణరెడ్డి శ్రీమతి నాగమణి, సోమేశ్వరం	సత్తి వీర్రాఘవరెడ్డి శ్రీమతి పార్వతి, కాకినాడ	శ్రీమతి వెలగల గంగాభవాని సుబ్బారెడ్డి, కాకినాడ	సత్తి లక్ష్మణరెడ్డి శ్రీమతి కనకమహాలక్ష్మి, కాకినాడ
సత్తి వెంకటరెడ్డి శ్రీమతి మంగాయ్యమ్మ	సత్తి లక్ష్మణరెడ్డి శ్రీమతి పల్లవి	శ్రీమతి కర్రి సూర్యకుమారి సత్తిరెడ్డి, కొప్పవరం	శ్రీమతి కొవ్వూరి ప్రభావతి సూర్యనారాయణరెడ్డి, బలభద్రపురం	కొవ్వూరి వెంకటరెడ్డి శ్రీమతి సీతామహాలక్ష్మి, బలభద్రపురం	శ్రీమతి సత్తి సీతామహాలక్ష్మి వీరవెంకట దొరప్రసాద్‌రెడ్డి, బలభద్రపురం	సత్తి అప్పారెడ్డి శ్రీమతి రాజరాజేశ్వరి
సత్తి లక్ష్మణరెడ్డి శ్రీమతి సుస్మిత	శ్రీమతి ద్వారంపూడి స్వర్ణలక్ష్మి వెంకటరెడ్డి, గొల్లలమామిడాడ	ద్వారంపూడి వెంకటరెడ్డి (లేటు) శ్రీమతి సత్యవతి (లేటు)	శ్రీమతి సత్తి బేబి అనే సునంద (లేటు) అమ్మిరెడ్డి	శ్రీమతి సత్తి నాగశిరోమణి వెంకటరెడ్డి	ద్వారంపూడి గంగిరెడ్డి శ్రీమతి శేషుకుమారి	ద్వారంపూడి సోమిరెడ్డి శ్రీమతి భాగ్యలక్ష్మి

A.R.ఫిష్ ప్రొడక్ట్స్, వాండ్రం, ఉండి మండలం, ప॥గో॥ జిల్లా
మే॥పా॥ ద్వారంపూడి నారాయణరెడ్డి, S.V.S.V.ప్రసాదరెడ్డి, సత్తి బ్రహ్మారెడ్డి
సత్తి వెంకట రామారెడ్డి, కర్రి సూర్యప్రభాకరరెడ్డి, సత్తి బాలసతీష్‌రెడ్డి, సత్తి శ్రీ వెంకట సంజీవ్‌రెడ్డి

జె వి బెవరేజెస్
JV BEVERAGES
SY.No: 430/2,
T-Narasapuram Village &
Mandal, Eluru District,
A.P-534467
Call: 011 69311642 |
www.jvbeverages.com